MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి :19 సంచిక: 3 రంగారెడ్డి నవంబర్ 2020 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఎఫ్ పి ఓలపై ఎం పిలతో సి ఎస్ బృందం చర్చలు !



**చిత్రంలో :** శ్రీ సి ఎస్ రెడ్డి తోపాటు అనంతపురం ఎంపి శ్రీ తలారి రంగయ్య, హిందూపురం ఎం పి శ్రీ గోరంట్ల మాధవ్, ఏ ఎఫ్ ఇ ఎస్ డైరెక్టర్ శ్రీమల్లారెడ్డి ప్రభృతులు

## కృష్ణరాధకు జర్మనీ అవార్డు !



ఎం టమాటా అధ్యక్షురాలు శ్రీమతి కృష్ణరాధకు జర్మనీ ప్రభుత్వం ప్రకటించిన ' గేమ్ ఛేంజర్ ' అవార్డును బహూకరిస్తున్న ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి

## మహిళా రైతు దినోత్సవ సంరంభం !




మదనపల్లెలో ...



కామారెడ్డిలో ...



నల్లమాడలో ....

## నాబార్డ్ కరపత్రం ఆవిష్కరణ !




'నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత' అనే అంశంపై నాబార్డ్ రూపొందించిన కరపత్రాలను, పోస్టర్లను జి హెచ్ ఎం సి జాయింట్ కమిషనర్ బి. సంధ్య గారు అక్టోబర్ రెండవతేదీన హైదరాబాద్‌లోని నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయంలో ఆవిష్కరించినప్పటి చిత్రం. నాబార్డ్ – టి ఎస్ – సి జి ఎం శ్రీ వై కె రావును, నాబార్డ్ సీనియర్ అధికారులను చిత్రంలో చూడవచ్చు

ఏపిమాస్ శిల్పులు!



శ్రీ జి శ్రీనివాస్
ప్రోగ్రాం
కోఆర్డినేటర్

NABARD నాబార్డ్, Brot für die Welt బ్రెడ్ ఫర్ ది వరల్డ్ సౌజన్యంతో


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుద్ధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
బహిరంగంగా బహిర్భూమికి వెళ్ళడం సరికాదు
మీ ఇంటి లోపల మరుగుదొడ్డి నిర్మాణం మంచి పరిష్కారం
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత


సంపుటి 19 సంచిక 3



సంపాదకీయం

## మహిళా రైతులు !

అత్యధికంగా గ్రామీణ వాతావరణం, చిన్నకమతాలు, పరిమిత సాంకేతిక వినియోగంతో కూడిన మన భారతదేశంలో వ్యవసాయ రంగం అంటే నిజానికి మహిళలదే! జాతీయ స్థాయిలో నమూనా సర్వే నిర్వహించే ఎన్ ఎస్ ఎస్ ఓ సంస్థ గణాంకాల ప్రకారం గ్రామీణ మహిళలలో 75% మంది రైతులే. దేశంలోని మొత్తం వ్యావసాయిక ఆహార ఉత్పత్తులలో 60 నుంచి 80 శాతం వాటా మహిళలదే. ఇక పాడి పారిశ్రామిక ఉత్పత్తుల విషయానికి వస్తే ఏకంగా 90% మహిళల శ్రమ ఫలితమే ! మరి వ్యవసాయ రంగం అన్నా, రైతులు అన్నా నిస్సందేహంగా, నిర్ద్వంద్వంగా మహిళలకు తప్ప మగవారికి అగ్రతాంబూలం, ప్రథమ ప్రాధాన్యం యివ్వడం సబబు, సహేతుకం కాదుగా? కాని అలా జరగడం లేదే ! పంటలు పండించడంలో 60 నుంచి 70 శాతం శ్రమ మహిళలదే అయినా, తాము పండించే పొలాలపై హక్కు వారికి లేదు, అధికారం వారిది కాదు. మన దేశంలో మొత్తం సాగుభూమిలో కేవలం 19.2 శాతం మాత్రమే మహిళల పేరిట వున్నదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంలో మన తెలుగు రాష్ట్రాలు కొంత మెరుగు. తెలంగాణాలో 36 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 30 శాతం వ్యవసాయ భూములు మహిళల నిర్వహణలో వున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. సమాజంలో పాతుకుపోయిన లైంగిక వివక్ష ఇందుకు ప్రధానకారణం. కొన్ని అననుకూల పరిస్థితులను, అంతగా అనువుకాని కొన్ని వ్యవసాయ పనులను ఇందుకు సాకుగా చూపి మహిళలకు పంటభూములపై పెత్తనం యివ్వడానికి నిరాకరిస్తుంటారు. కాని, అన్ని రంగాలలో తమ ప్రాబల్యాన్ని చాటుతూ, సర్వం తమకు సాధ్యమేనని నిరూపిస్తున్న మహిళలు వ్యవసాయ రంగంలో తమకు న్యాయంగా దక్కవలసిన గుర్తింపుకోసం, సాధికారతకోసం నడుంబిగించారు. ముఖ్యంగా రెండు దశాబ్దాలకుపైగా మహిళా స్వయంశక్తికి సంకేతంగా నిలిచి, వారిలో నిద్రాణంగా వున్న ప్రతిభాపాటవాలను, నైపుణ్యాలను వెలికితీసిన స్వయంసహాయ ఉద్యమం అందించిన స్ఫూర్తితో మహిళలు వ్యవసాయ రంగంలో తమ ప్రాధాన్యానికి తగిన గుర్తింపును, సాధికారతను పొందడంకోసం గట్టిగా కృషిచేస్తుండడం ఆహ్వానించదగిన పరిణామం. మనదేశంలో గత నాలుగేళ్ళుగా అక్టోబర్ 15 వ తేదీన జరుపుకుంటున్న 'మహిళా రైతుల దినోత్సవం' ఇందుకు ఒక ఉదాహరణ. వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓ లు లేదా ఎఫ్ పి సి లు) ఏర్పాటు, వాటి ప్రగతి గమనం ఇందుకు చెప్పుకోదగిన దోహదం చేస్తున్నాయి. ఈ ఎఫ్ పి ఓలు రైతులకు కొత్త శక్తిసామర్థ్యాలను, నైపుణ్యాలను అందిస్తున్నాయి. వారికి వ్యవసాయంతోపాటు వ్యాపారపు మెళకువలను నేర్పి సుస్థిరాభివృద్ధికి బాటలు వేస్తున్నాయి. పూర్తిగా మహిళలే వాటాదారులుగా వున్న ఎఫ్ పి ఓలు గణనీయంగా ప్రగతి సాధిస్తుండడం గమనించవలసిన అంశం. ఏపిమాస్ తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఇరవైకి పైగా ఎఫ్ పి ఓలకు మార్గదర్శకత్వం వహిస్తున్నది. వీటిలో మదనపల్లి ప్రాంత ఎఫ్ పి ఓ ల ఫెడరేషన్ ఎం–టమాట ఒకటి. ఆ ఫెడరేషన్ అధ్యక్షురాలు శ్రీమతి కృష్ణరాధ కరోనా కల్లోలంలో చిత్తూరు జిల్లాలో టమాటా రైతులకు అండగా నిలిచి, ఎంతో పకడ్బందీగా 2,000 టన్నులకు పైగా పంట కొనుగోళ్ళు, విక్రయాలు జరిపి, జర్మనీకి చెందిన జి ఐ జడ్ సంస్థ నుంచి 'వ్యవసాయం తీరుతెన్నులను మార్చిన మహిళ' (గేమ్ ఛేంజర్ విమన్ ఇన్ అగ్రికల్చర్) అవార్డును అందుకోవడం మహిళా రైతుల కార్యదక్షతకు, నిర్వహణ సామర్థ్యానికి చక్కని ఉదాహరణ. వారి అంకితభావాన్ని, సామర్థ్య నైపుణ్యాలను ప్రభుత్వాలు గుర్తించి వ్యవసాయ రంగంలో వారి కృషికి తగిన గుర్తింపు, సాధికారత లభించే సకల చర్యలు తీసుకోవడం అవసరం. 2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పం నెరవేరాలంటే వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళలకు తగిన ఆదర ప్రోత్సాహాలు, వారి శ్రమకు గుర్తింపు, అవసరమైన భద్రతలు లభించేలా చూడడం తప్పనిసరి. ప్రభుత్వాలు మహిళా రైతు దినోత్సవానికి ఒక తేదీని నిర్ణయించడం, జరుపుకోండంటూ ప్రకటించడంతో సరిపెట్టి, ఈ మౌలిక అంశాలను నెరవేర్చడంలో శ్రద్ధ వహించకపోతే మహిళా రైతు దినోత్సవాలు ఎన్ని జరిగినా, ఎంత ఘనంగా జరుపుకున్నా ప్రయోజనం వుండదు. అయితే, సంఘటిత శక్తి సాధించలేనిది లేదనే సంగతి మహిళలకు బాగా తెలుసు. ఆ సంఘటిత శక్తి ప్రభుత్వాల మెడలు వంచైనా సరే వారి న్యాయబద్ధమైన కోర్కెలను, అవసరాలను త్వరలోనే నెరవేరుస్తుందని ఆశిద్దాం.



Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**

చుక్కాని తిప్పగలిగే సామర్థ్యమున్న వారికి గాలి అనుకూలిస్తుంది, అలలూ అనుకూలిస్తాయ్

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....

➪ మహోత్సాహంగా మహిళా రైతు దినోత్సవం! ...05

➪ ఎం-టమాట' కృష్ణరాధకు జర్మనీ పురస్కారం ! ...07

➪ ప్రభుత్వ విధానాలపై ఏపిమాస్ చర్చా వేదికలు ...09

➪ నాబార్డ్ స్వచ్ఛత ప్రచారోద్యమం ...10

➪ నాబార్డ్ చే వంద వాష్ అవగాహన సదస్సులు ...11

➪ పాలమూరులో కోటి విత్తన బంతుల సంరంభం! ...16

➪ అనేక రాష్ట్రాలలో శ్రీనివాస్ శిక్షణలు! ...18

➪ గొర్రెలు, మేకలలో కాలి పుండ్ల వ్యాధి ...23

➪ 'ధరణి' ఎఫ్ పి ఓ పాలకవర్గ సభ్యులకు శిక్షణ ...26

➪ సమీకృత వ్యవసాయ ఫలాలు ...27

➪ హింస భరించవద్దు ... మాకు చెప్పండి ! ...28

➪ సాగుకు భరోసాలేకుంటే గ్రామాలకు భవిష్యత్తే లేదు...30

➪ మదనపల్లె నుంచి 'కిసాన్ రైలు' ...31

➪ 'శ్రీ' పద్ధతి రాగి సాగుతో అధిక దిగుబడులు ...32

➪ నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత పై అవగాహన ...34

**గమనిక :** 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆశావహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.

### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్స్ : 08413-403118/ 19/20, ఫాక్స్ : 08413-403117 Web: www.apmas.org, E Mail: info@apmas.org

ఒడ్డున నిలిచి యెంతకాలం అలలను చూసినా సముద్రాన్ని దాటలేవు, దాటించే మార్గమేదో అనుసరిస్తేతప్ప...

# మహెూత్సాహంగా మహిళా రైతు దినోత్సవం!

– జి. శ్రీనివాస్ , గోపాలరాజు , **అబ్దుల్ ఖాదర్**

*అక్టోబర్ 15 వ తేదీ 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం', జాతీయ 'మహిళా రైతుల దినోత్సవం' సందర్భంగా ఏపిమాస్ కార్యక్షేత్రాలలో, భాగస్వామ్య సంస్థల కార్యక్షేత్రాలలో మహిళా రైతుల, గ్రామీణ మహిళల దినోత్సవాలను మహెూత్సాహంగా జరుపుకున్నారు. ఆదర్శ మహిళా రైతులకు సన్మానాలు చేసి, పురస్కారాలు అందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా మదనపల్లెలో, అనంతపురం జిల్లా నల్లమాడ, గుడిబండ మండలాలలో, తెలంగాణాలోని కామారెడ్డిలో ఏపిమాస్ ఆధ్వర్యంలో 'మహిళా రైతు దినోత్సవాలు' జరుపుకోగా, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఏ ఎఫ్ ఎకాలజీ సెంటర్ నిర్వహణలో, అనంతపురం జిల్లా కురుగుంట గ్రామంలో 'రెడ్స్' సంస్థ ఆధ్వర్యంలో మహిళా రైతు దినోత్సవాలు ఘనంగా జరిగాయి.*

**వ్య**వసాయాన్ని, గ్రామీణ అభివృద్ధిని పరిపుష్టం చేసి, ఆహార భద్రతను పెంపొందించి, గ్రామీణ పేదరికాన్ని నిర్మూలించడంలో గ్రామీణ మహిళలు వహిస్తున్న కీలకమైన పాత్రకు, సాగిస్తున్న కృషికి గుర్తింపుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 15వ తేదీని 'గ్రామీణ మహిళా దినోత్సవం'గా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి 2007 లో తీర్మానించింది. 2017 ఆగస్టులో భారత ప్రభుత్వం అక్టోబర్ 15 వ తేదీని 'మహిళా రైతుల దినోత్సవం'గా జరపాలని ప్రకటించింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 15 వ తేదీన ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఏపిమాస్, దాని అనుబంధ సంస్థల నిర్వహణలో జరిగిన మహిళా రైతు దినోత్సవ విశేషాలను తెలుసుకుందాం.

**మదనపల్లెలో ...**

**ఏ**పిమాస్ సంస్థ నిర్వహణలోని 'పాడి పంటలు' ప్రాజెక్టు సౌజన్యంతో 'మహిళా రైతు దినోత్సవాన్ని' అక్టోబరు 15వ తేదీన మదనపల్లి జి.ఐ.సి. ఆఫీసులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లాలోని 9 రైతు ఉత్పత్తిదారుల సంస్థలు , ఎం.–టమాట ఫెడరేషన్‌కు చెందిన అధ్యక్షులు, డైరెక్టర్లు, సి.ఇ.ఓ.లు, పాడి పంటలు, జి.ఐ.సి. ప్రాజెక్టుల సిబ్బంది పాల్గొన్నారు. ఎం–టమాట ఫెడరేషన్ అధ్యక్షురాలు శ్రీమతి కృష్ణరాధ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన మదనపల్లి ఎంపీడీఓ శ్రీమతి లీలామాధవి మాట్లాడుతూ వ్యవసాయంలో మహిళల పాత్ర పెరుగుతోందన్నారు. మహిళలకు భూమిపై హక్కు చాలా స్వల్పంగా ఉండడం బాధాకరమని, సాగులో వారి భాగస్వామ్యం చాలా ఎక్కువ అనే విషయం గ్రహించాలని చెప్పారు.

**వేదికపై ఆసీనులైన వారు**

ఎం.–టమోట ఫెడరేషన్ అధ్యక్షురాలు, మదనపల్లి ఎఫ్.పి.సి. అధ్యక్షురాలు ఎ. క్రిష్ణరాధ గారు, కురబలకోట ఎఫ్.పి.ఒ. అధ్యక్షురాలు యస్. శిరీష గారు, రామసముద్రం ఎఫ్.పి.ఒ. అధ్యక్షురాలు బి. రెడ్డెమ్మ గారు, నిమ్మనపల్లి ఎఫ్.పి.సి. డైరెక్టర్ వి. ఉషారాణి గారు, పీలేరు ఎఫ్.పి.సి. డైరెక్టర్ యం.శ్రీదేవి గారు, వాయల్పాడు ఎఫ్.పి.ఒ. డైరెక్టర్




కె.సావిత్రమ్మ గారు, కలికిరి ఎఫ్.పి.ఒ. డైరెక్టర్ యస్.అమ్ములు గారు, వి.కోట ఎఫ్.పి.ఒ. డైరెక్టర్ ఇ. వసంతబాయి గారు, పలమనేరు కౌండిన్య ఎఫ్. పి. సి. డైరెక్టర్, జి.జ్యోతి గారు, మదనపల్లి యం. పి. డి. ఓ లీలామాధవి గారు వేదికపై ఆసీనులయ్యారు.

గెలుపేకాదు, అప్పుడప్పుడూ ఓటమికూడా అవసరమే లేకుంటే నాణాకి రెండోవైపు ఏముందో ఎలా తెలుస్తుంది?

కళామణి గారు, ప్రొఫెసర్ పద్మావతి గారు ఫోన్ కాల్ ద్వారా ప్రసంగించారు.

**మహిళలపాత్ర పెరగాలి: కళామణి**

మహిళలు వ్యవసాయానికి వెన్నుపూస వంటివారు. భారత ప్రభుత్వం, ఐక్యరాజ్యసమితి మహిళా రైతు దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించారు. మహిళలు ఇంటిపనులు, సేవలు చేయుటకు పరిమితమైనారు. తగిన గుర్తింపు లభించడంలేదు. మహిళల పేరుమీద పొలం ఉండటంలేదు. కుటుంబంలో ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో మహిళల పాత్ర ఉండాలని ఆమె అన్నారు.

20 రాష్ట్రాల నుండి 100 పైగా సంస్థల భాగస్వామ్యంతో మహిళా రైతుల హక్కుల వేదిక (మకాం) జాతీయ వేదికగా ఏర్పడిందని,. ఇది ప్రధానంగా పేద, చిన్న సన్నకారు మహిళా రైతులకు, వ్యవసాయ కూలీలకు గుర్తింపును సాధించేందుకు పనిచేస్తున్నదని కళామణి గారు తెలిపారు.

ఎఫ్.పి.ఓ లో మహిళలు ముఖ్యపాత్ర పోషించాలని, మహిళా షేర్ హోల్డర్లు పెరగాలని, ప్రెసిడెంటు, సెక్రెటరి లాంటి అధికార స్థానాలు పొందాలని, ఈ విధమైన అభివృద్ధి సాధించడానికి వారికి ఎలాంటి శిక్షణలు కావాలో మహిళలు తెలియచేయాలని శ్రీమతి కళామణి కోరారు.

**గుర్తింపు లేదు: పద్మావతి :** మొక్క నాటినప్పటినుండి పంటకోత వరకు మహిళల భాగస్వామ్యం ప్రతిదశలో ఉంది. ప్రతి పనిని శ్రద్ధతో చేస్తారు. కాని మహిళకు రైతుగా గుర్తింపు లభించడం లేదు.

తమ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మహిళా రైతులు కోరారు.

మకాం సంస్థ కరపత్రాన్నిఈ కార్యక్రమంలో విడుదల చేసి, పాల్గొన్నవారందరికి పంచారు.

అనంతరం ఏపిమాస్ ఆధ్వర్యంలో వ్యవసాయరంగంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన రైతు ఉత్పత్తిసంఘాల (ఎఫ్‌పీవో) నిర్వాహకులకు ఘన సత్కారం జరిగింది. కార్యక్రమంలో ఏపీమాస్ డైరెక్టర్ శ్రీ వినాయకరెడ్డి, శ్రీ వాసుదేవరెడ్డి, ఎం-టమాట ప్రెసిడెంట్ శ్రీమతి కృష్ణరాధ పాల్గొన్నారు.

**కామారెడ్డిలో 'ధరణి ఎఫ్ పి ఓ' ఆధ్వర్యంలో ...**

**కా**మారెడ్డి జిల్లాలోని ధరణి ఎఫ్.పి.ఓలో మహిళా రైతుల దినోత్సవాన్ని 'మహిళా రైతుల హక్కుల వేదిక' ప్రోత్సాహంతో, ఏపిమాస్, డి.జి.ఆర్.వి సహకారంతో ఘనంగా నిర్వహించారు. అక్టోబర్ 15న నిర్వహించిన ఈ మహిళా రైతు దినోత్సవంలో 55 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

ముందుగా తయారుచేసుకున్న ఎజెండా ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎజండాలో భాగంగా మహిళా



రైతుల హక్కుల వేదిక రూపొందించిన కరపత్రాలను రైతులకు పంచిపెట్టారు. మహిళా రైతుల దినోత్సవం, దాని ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. మహిళా సాధికారత సాధనలో ఏపిమాస్ పాత్ర , సాధించిన విజయాలను కొనియాడారు. 19 వసంతాలను పూర్తి చేసుకొని 20వ వసంతలో అడుగుపెట్టిన ఏపిమాస్ సేవలను కొనియాడారు.

మహిళా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి రాబోయే రోజులలో ఏ.పి.ఓ స్థాయిలో మహిళలు ఒక కమిటి ఏర్పాటు చేసుకొని వివిధ సమస్యలను పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. ఇతర నిర్ణయాలు, తీర్మానాల వివరాలు:

- మహిళా రైతులను , పురుష రైతులను సమాన దృష్టితో చూడాలి.
- ఎఫ్.పి.ఓ లో మహిళా సభ్యులను చేర్పించాలి.
- రైతు సంఘాలకు మహిళలు నాయకత్వం వహించాలి.
- ఎఫ్.పి.ఓ పాలక వర్గ సభ్యులలో మహిళలు సగభాగం ఉండాలి.

**(మిగతా 12 వ పేజీలో )**

# 'ఎం-టమాట' కృష్ణరాధకు జర్మనీ పురస్కారం !

ఎం–టమాట వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ (ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్) అధ్యక్షురాలు, మహిళా రైతు శ్రీమతి కృష్ణరాధకు జర్మనీకి చెందిన జి ఐ జడ్ సంస్థ 'గేమ్ ఛేంజర్ ఉమన్ ఇన్ అగ్రికల్చర్' (వ్యవసాయం తీరుతెన్నులను మార్చిన మహిళ) అవార్డును ప్రకటించింది. మదనపల్లె మండలంలోని అంకిశెట్టిపల్లెకు చెందిన శ్రీమతి కృష్ణరాధ గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయానికి సంబంధించి విశేష ప్రతిభ కనపరిచి నందుకు జి ఐ జడ్ తాను నిర్వహిస్తున్న 'వన్ వరల్డ్ నో హంగర్' (ఆకలికి తావులేని ఒకే ప్రపంచం) ప్రాజెక్టులో భాగంగా ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. జర్మనీ నుంచి మదనపల్లెలోని ఏపిమాస్ కార్యాలయానికి ఈ అవార్డును జి ఐ జడ్ సంస్థ కొరియర్‌లో పంపింది. అక్టోబర్ 15 న అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవం సందర్భంగా ఏపిమాస్ కార్యాలయంలో శ్రీమతి కృష్ణరాధకు ఏపిమాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఈ అవార్డును అందజేశారు. ఈసందర్భంగా ఏపిమాస్ డైరెక్టర్ శ్రీ వినాయకరెడ్డి మాట్లాడుతూ 14 దేశాల్లో 48 నామినేషన్ల నుంచి ఏడుగురిని ఎంపిక చేస్తే భారతదేశంనుంచి శ్రీమతి కృష్ణరాధ జిఐజడ్ అవార్డుకు ఎంపికయ్యారన్నారు. కృష్ణరాధ కోవిడ్–19 సమయంలో రైతులు నష్టపోకుండా సుమారు 2,000 టన్నులకు పైగా టమాటలను కొనుగోలుచేసి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు రవాణా చేశారని శ్రీ వినాయకరెడ్డి తెలిపారు.



కృష్ణరాధకు మదనపల్లి మహిళా రైతు దినోత్సవంలో సన్మాన దృశ్యం

**అంగవైకల్యాన్ని జయించిన ఆత్మ విశ్వాసం**

జర్మనీకి చెందిన జిఐజడ్ సంస్థ 'గేమ్ ఛేంజర్ ఉమన్ ఇన్ అగ్రికల్చర్' (వ్యవసాయం తీరుతెన్నులను మార్చిన మహిళ) బహుమతి ప్రదానోత్సవ కార్య క్రమానికి విచ్చేసిన ఆహ్వానితులకందరికి బహుమతి గ్రహీత శ్రీమతి కృష్ణ రాధ తన హృదయ పూర్వక ధన్య వాదాలు తెలియజేశారు. ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోవడానికి తాను ఏ విధంగా అర్హత సాధించిందీ, టమాటా మహిళా రైతునుంచి ఎం–టమాట ఫెడరేషన్ అధ్యక్షురాలిగా ఎదిగిన తన వ్యవసాయ జీవన ప్రస్థానాన్ని గురించి ఆమె తన ధన్యవాదాల ప్రసంగంలో క్లుప్తంగా పేర్కొన్నారు. ఆ వివరాలను ఆమె మాటలలోనే తెలుసుకుందాం.

'హరిత వినూత్న కేంద్ర పథకం తోడ్పాటుతో ఏపి మాస్ సంస్థ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాలో ఏర్పాటైన జిల్లాస్థాయి రైతు ఉత్పత్తి దారుల సంస్థల సమాఖ్య అయిన ఎం.టమాటా రైతు ఉత్పత్తి దారుల కంపెనీ (ఎఫ్ పి సి) కి నేను డైరెక్టర్ గా వున్నాను. ముందుగా నేను టమాటా రైతును. తర్వాత ఈ ఎఫ్ పి సి వ్యవస్థాపకురాలిని.

నేను పోలియో వ్యాధినపడి అంగ వైకల్యానికి గురి అయినా, ఎక్కడా ఆత్మస్థయిర్యం కోల్పోకుండా మా కుటుంబాన్ని మేలుబాటలో నడిపించడానికి, నేను డైరెక్టర్‌గా వున్న రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తున్నాను.

గత మూడు సంవత్సరాలుగా తాలూకా స్థాయిలోను, గ్రామ స్థాయిలోను మహిళలను రైతు ఉత్పత్తి దారుల సంఘాలలో చేర్చుటకు శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నాను. పూర్తిగా మహిళలతో ఏర్పాటైన 'ధరణి రైతు ఉత్పత్తి దారుల సంస్థ' కు ఒక వ్యవస్థాపసభ్యురాలిని.

హరిత వినూత్న కేంద్ర (గ్రీన్ ఇన్నొవేషన్ సెంటర్ – జి ఐ సి) కార్యక్రమాలలో, ముఖ్యంగా ఉమ్మడి మార్కెటింగ్

సానబెట్టందే వజ్రం ధగధగ మెరవదు, రాటుతేలందే మనిషికి రాణింపురాదు

కార్యక్రమాలలోను, వివిధ రకాల టమాటా విలువ గొలుసు కార్యక్రమాలలోనూ నేను చురుకుగా పాల్గొనడమే గాక చురుకైన పాత్ర పోషిస్తున్నాను. వ్యవసాయ రంగంలోని వివిధ కార్యక్రమాలలో మహిళల చురుకైన భాగస్వామ్యాన్ని గురించి, వారి కీలక పాత్ర గురించి నేను చాటి చెప్పాను.

**విమర్శలు, అవహేళనలు**

నేను రైతుఉత్పత్తి దారుల సంస్థలో చేరి కార్యక్రమాలు ప్రారంభించిన తొలి రోజులలో నాతోటి రైతుల నుండి ముఖ్యంగా పురుషుల నుండి అనేక విమర్శలు ఎదుర్కొనడం జరిగింది. వారు నన్ను మానసికంగా నిరుత్సాహ పరిచారు. సహకార సంఘాలను నడుపుటకు, వివిధ రకాల మార్కెటింగ్ కార్యక్రమాలను చేపట్టుటకు కావలసిన సామర్థ్యాలు మహిళలకు వుండవని, ఈ కార్యక్రమాలు "త్రాగడానికి సిద్ధంగా కప్పులో వున్న టీ కాదని" అనేక మంది హేళనగా మాట్లాడారు. ఎవరెన్ని అన్నాకూడా మా కుటుంబ సభ్యుల తోడ్పాటు, వారి నుండి లభించిన ప్రోత్సాహం నాలో ఆత్మ స్థయిర్యాన్ని పెంచి నన్ను విజయం వైపు నడిపించింది.

మహిళలే భాగస్వాములు గా వున్న 'ధరణి గ్రామ రైతు సంఘం' సభ్య రైతుల ఉత్పాదన అవసరాలు తీర్చడం కోసం చేపట్టిన అధిక నాణ్యత కలిగిన పశువుల దాణా, ఎరువులు, టార్పాలిన్ పట్టలు, మందు కొట్టే యంత్రాలు మొదలగు వాటిని రైతులకు వారి ఇంటి వద్దకే చేర్చడంలో క్రియా శీలకంగా పనిచేశాను. అంతేగాక బయట మార్కెట్ కన్నా తక్కువ ధరలకు వివిధ రకాల ఉత్పత్తులను అందించాము. ధరణి గ్రామ రైతు సంఘంచేపట్టిన మార్కెటింగ్ కార్య క్రమాల నుండి పొందిన అనుభవం జిల్లా స్థాయిలో వివిధ రైతు ఉత్పత్తి దారుల సంస్థలకోసం ఎక్కువగా ఆర్డర్‌లను పొందడంలో నాకు చాలా ఉపయోగ పడింది.

ఉమ్మడి మార్కెటింగ్ కార్యక్రమాలైన పశువుల దాణా, ఎరువులు, టార్పాలిన్ పట్టలు, కూరగాయలు, పండ్ల క్రయ విక్రయాల ద్వారా మహిళా రైతులతో సహా మొత్తం దాదాపు 7000 మంది రైతులు లబ్ధిపొందడం నాకు ఎంతైనా చాలా సంతోషం కలిగించే అంశం.

**కోవిడ్ కల్లోలంలో రైతుసేవలు**

కోవిడ్ మహమ్మారి వలన పండించిన పంటలకు ధరలు లేక, ముఖ్యంగా టమాటా ధరలు పూర్తిగా పడిపోయి, నిరాశలో వున్న రైతులను ప్రాసెసింగ్ కంపెనీలతో అను సంధానించి, వారు పండించిన టొమాటోలను సముచిత ధరలకు కొనుగోలుచేసేలా చూడడం నా జీవితంలో చాలా సంతోషం కలిగించిన కార్యక్రమం. కోవిడ్ లాంటి అత్యంత క్లిష్ట సమయంలో రైతులను ఆదుకొన్న హరిత వినూత్న కేంద్ర భాగస్వామ్య సంస్థలైన ఏపిమాస్ కు, జి.ఐ.జడ్ వారికి నేను మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను.

**ఏపిమాస్, సి ఎస్ రెడ్డిగారు నా మార్గదర్శకులు**

హరిత వినూత్న కేంద్ర పథకం తోడ్పాటుతో ఏపిమాస్ సంస్థ ద్వారా నేను రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో నాయకత్వం, పాలన, నిర్వహణ మొదలగు అంశాలపై అనేక శిక్షణలు పొందాను. ఈ శిక్షణలు పొందకపోతే నాలో వున్న శక్తి సామర్థ్యాలు బయటకు వచ్చేవి కావు. ఏపిమాస్ సిబ్బంది నా వెనువెంట వుండి నిరంతరంగా నన్ను ప్రోత్సహిస్తూ నాఎదుగుదలకు మార్గదర్శకులు అయ్యారు .

'వ్యవసాయం తీరుతెన్నులను మార్చిన మహిళ ' అవార్డు తీసుకుంటున్నందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. నాకు ఈ అవార్డు వచ్చి నందుకు మా కుటుంబ సభ్యులు కూడా సంతోషించడంతో పాటు గర్వపడుతున్నారు.

మా రైతు ఉత్పత్తిదారుల సంస్థలోని నాతోటి బోర్డు సభ్యులకు, సభ్య రైతులకు ఏపిమాస్ సంస్థకు ముఖ్యంగా నన్ను నిరంతరం ప్రోత్సహిస్తూ నా ఎదుగుదలకు మార్గదర్శి అయిన ఏపిమాస్ సి.ఈ.ఓ శ్రీ సి.ఎస్. రెడ్డి గారికి, మహిళల అభివృద్ధికి కృషిచేస్తున్న జి.ఐ.జడ్ సంస్థకు నేను ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ అవార్డు మహిళా రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడడానికి నా బాధ్యతను మరింత పెంచిందని, ఆ బాధ్యతను నెరవేర్చడానికి నేను కట్టుబడి వున్నానని సభాముఖంగా తెలియజేస్తున్నాను.

**ఇక నా కుటుంబ వివరాలు:** నాభర్త బట్టలను నేసే చేనేత పనివారు. మాకొక బాబు. మదనపల్లి మండలంలోని అంకిశెట్టిపల్లిలో మేము నివాసం వుంటున్నాము. ■

అసలే చెదిరిపోయే కల, ఆపైన దానికి ఒక నీడ అయినా ఆశాజీవికి ఆచిన్న ఆధారంచాలు, ముందుకు సాగడానికి, సాధించడానికి

# ప్రభుత్వ విధానాలపై ఏపిమాస్ చర్చా వేదికలు

– వేద్ ప్రకాశ్ సింగ్, నీవా సి

ఏపిమాస్ ప్రధానంగా అభివృద్ధిరంగంలో పనిచేసే లాభార్జన దృష్టిలేని సంస్థ. ఈ సంస్థ చేపట్టే వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వాలతో కలసి పనిచేయవలసి వుంటుంది. ఈ కారణంగా ప్రభుత్వ విధానాల (పాలసీ) పట్ల , చట్టాలు, నియమ నిబంధనల పట్ల ఏపిమాస్‌కు తగిన అవగాహన, అనుభవం వున్నాయి. అయితే, ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ స్థాయిలలో ప్రభుత్వాల విధానాలలో వచ్చే మార్పుల ప్రభావం ప్రాజెక్టుల నిర్వహణపై ఎంతగానో వుంటుంది. అందువల్ల ముఖ్యమైన ఇటువంటి అంశాలపట్ల ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని తెలుసుకోవడం, అవగాహనను పెంపొందించుకోవడం ఏపిమాస్‌కు అవసరం.

ఈ ఆవశ్యకతను దృష్టిలో వుంచుకుని సంస్థ స్థాయిలో ప్రభుత్వ విధానాలపై చర్చా వేదికలను (పాలసీ చర్చ) నిర్వహించాలని సంస్థ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి సంకల్పించారు. ఈ సంకల్పాన్ని ఆచరణలోకి తెస్తూ మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫీసర్ నీవా సి గారు, ఎఫ్ పి ఓ రీసెర్చ్ అండ్ అడ్వొకసీ ప్రాజెక్ట్ మేనేజర్ వేద్‌ప్రకాశ్ సింగ్ గారు రెండు చర్చావేదికలను నిర్వహించారు.

'పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ఆమోదంపొందిన మూడు వ్యవసాయ బిల్లులు' అనే అంశంపైన 2020 సెప్టెంబర్ 19వ తేదీన తొలి చర్చా వేదికను నిర్వహించగా, 2020 అక్టోబర్ 12వ తేదీన 'విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ చట్టం–2020' అనే అంశంపై చర్చావేదిక జరిగింది. ఈ రెండు అంశాలూ ఏపిమాస్ కార్యనిర్వాహక రంగంపైన, నిర్వహించే ప్రాజెక్టులపైన, భాగస్వాములపైన ఎంతగానో ప్రభావంచూపేవే. ఈ చర్చావేదికలలో పాల్గొనడం, చర్చించడం పట్ల మంచి ఆసక్తి వ్యక్తమైంది.

**వ్యవసాయ బిల్లులపై చర్చావేదిక**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ఆమోదంపొందిన మూడు వ్యవసాయ బిల్లులపై ఈ చర్చావేదికను ఏపిమాస్ జీవనోపాధుల విభాగం డైరెక్టర్ జయరామ్ గారు, వేద్‌ప్రకాశ్ సింగ్ గారు, నీవా సి గారు నిర్వహించారు.

**పార్లమెంట్ ఆమోదంపొందిన మూడు బిల్లులు**

1) వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు, వాణిజ్యం : ఇందుకు సంబంధించి గతంలో ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ చట్టాన్ని తీసుకువచ్చారు. వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కడైనా కొనుగోలుచేసే / అమ్ముకునే స్వేచ్ఛను కల్పించడం, రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చూడడం ఈ బిల్లు ఉద్దేశాలుగా ప్రభుత్వం పేర్కొన్నది.

2) ధరల హామీ, వ్యవసాయ సేవలపై రైతుల (సాధికారత, సంరక్షణ) ఒప్పందం : దళారీలను నివారించి రైతు నేరుగా పెద్దకొనుగోలుదారులతో, ప్రాసెసింగ్ పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకోడానికి అవకాశం కల్పించాలన్నది ఈ బిల్లు ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొన్నది. ఇంతేకాకుండా మార్కెట్‌లో అనూహ్యంగా సంభవించే ధరల హెచ్చుతగ్గుల దుష్ఫలితాలు రైతుపై పడకుండా ఒప్పందం కుదుర్చుకున్న కొనుగోలుదారు లేదా పరిశ్రమే వాటికి బాధ్యత వహించడంకూడా ఈ బిల్లు ఆశయాలలో ఒకటి.

3) నిత్యావసర వస్తువుల చట్టం (సవరణ) బిల్లు 2020: నిత్యావసర వస్తువుల రంగంలో ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించడానికి వీలుగా తృణధాన్యాలు, వంటనూనెలు, కాయధాన్యాలు, నూనె గింజలు, ఉల్లిపాయలు, ఆలు గడ్డలపై వున్న ఆంక్షలను తొలగించడంకోసం ఈ బిల్లును తెచ్చారు. ఈ బిల్లుల విషయంలో (1) ప్రస్తుత నేపథ్యం (2) ఇవి ఎంతవరకు సమమజసం, వీటి ప్రభావం ఎలా వుంటుంది, (3) ఏపిమాస్‌లో వీటిపట్ల అవగాహన కలిగించడం అనే మూడు కోణాలలో చర్చ జరిగింది.

రెండవ చర్చ

రెండవసారిగా 'విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ చట్టం (ఎఫ్ సి ఆర్ ఏ) –2020' అనే అంశంపై చర్చ 2020

**(మిగతా 29వ పేజీలో)**

**సమస్యలను కొనితెచ్చుకోవడమే నీ స్వభావమైతే అలానేచెయ్, కానీ, ఆ సమస్యలను నీ పొరుగువారికి అంటించకు**

# నాబార్డ్ స్వచ్ఛత ప్రచారోద్యమం

స్వచ్ఛ భారత్ మిషన్ ప్రోత్సాహక సంస్థగా నాబార్డ్ 'వాష్' (నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత) ఉత్పాదనలపై అవగాహన పెంపొందించడానికి తన కార్యక్షేత్రాలలో తన భాగస్వామ్య సంస్థల ద్వారా దేశవ్యాప్తంగా స్వచ్ఛత ప్రచార (పారిశుద్ధ్య అవగాహన ప్రచార) కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి,నీటి సరఫరాకు నిధులు సమకూరుస్తూ నాబార్డ్ ఇప్పటికే స్వచ్ఛభారత్ మిషన్‌కు తోడ్పాటునందిస్తున్నది.



ఈ ప్రచారోద్యమంలో భాగంగా 2020 అక్టోబర్ 2 వ తేదీనుంచి 2021 జనవరి 26 వరకు దేశవ్యాప్తంగా మొత్తం 2000 కార్యక్రమాలను నిర్వహించాలని సంకల్పించింది. తెలంగాణాలోని అన్ని జిల్లాలలో మొత్తం 100 గ్రామస్థాయి ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ప్రణాళిక రూపొందించడం జరిగింది. ఈ ప్రచారం ఆశయాలు: (1) పారిశుద్ధ్యంపైన, పరిశుభ్రతపైన గ్రామీణ ప్రజల ప్రవర్తనలో/ స్వభావంలో మార్పుతీసుకురావడం (2) నీరు, పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రోత్సహించేలా గ్రామీణ ప్రజలలో అవగాహనను, ఆసక్తిని పెంపొందించడం (3) 'వాష్' కార్యక్రమాలకు అప్పులు యిచ్చే విషయంలో రుణ సహాయ సంస్థల సందేహ సంకోచాలను నివారించడం (4) లబ్ధిదారులకు సంబంధించిన అంశాలను తెలుసుకోవడం, ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందాలని ఆశించే లబ్ధిదారులు ఎంతమంది వుంటారో ఆ వివరాలను సేకరించడం, డేటా బేస్ రూపొందించడం మొదలైనవి (5) 'వాష్' ఉత్పాదనలకు రుణ సహాయ నమూనాలను, సంస్థాపర రుణసహాయాన్ని ప్రోత్సహించడం (6) గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, అనారోగ్యంవల్ల వారు కోల్పోయిన జీవితకాలాన్ని సమకూర్చడం, ఆరోగ్య సంరక్షణ కోసం కుటుంబాలుచేసే వ్యయాన్ని తగ్గించడం (7) పారిశుద్ధ్యంపట్ల అవగాహనను పెంపొందించి కోవిడ్-19 నుంచి రక్షణ పొందేలా చూడడం. బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ (ఓ డి ఎఫ్) కు చేపట్టిన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వాలు సాధించిన విజయాలను సుస్థిర పరుస్తూ, ఓ డి ఎఫ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్ళే కార్యక్రమాలను ప్రోత్సహించడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచుకునే విషయమై ప్రజల ప్రవర్తనలో మార్పుకోసం కృషిచేయడం, వాష్ రంగంలో రుణ సదుపాయ అవకాశాలను కల్పించడం ఈ ప్రచారం లక్ష్యాలు.

నాబార్డ్ తెలంగాణా ఆర్ ఓ సి జి ఎం శ్రీ వై కె రావు స్వచ్ఛత ప్రచార కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. గ్రామీణ ప్రజలలో పారిశుద్ధ్యం పట్ల అవగాహనను పెంపొందించడం, గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచి, గ్రామీణ పర్యావరణ పరిశుభ్రతను సాధించడం, అందరికీ మెరుగైన, సుస్థిరమైన భవిష్యత్తుకోసం ఉద్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను (ఎస్ జి డి లు) నెరవేర్చడం, పారిశుద్ధ్యానికి సంబంధించిన సరైన పద్ధతులు, పరికరాలపట్ల వాటిని చక్కగా నిర్వహించుకోవడం పట్ల, వ్యక్తిగత పరిశుభ్రతపట్ల వాష్ లక్ష్యాలపట్ల, కోవిడ్-19 కు సంబంధించి పాటించవలసిన నియమాల పట్ల అవగాహన కలిగించడం ఈ ప్రచారం ద్వారా ఆశిస్తున్న ఫలితాలని ఆయన వివరించారు.

తెలంగాణా రాష్ట్రస్థాయి స్వచ్ఛత ప్రచారసమావేశంలో నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయ సీనియర్ అధికారులు, మేడ్చల్ జిల్లా ఎస్ హెచ్ జి సభ్యులు పాల్గొన్నారు. ■

**గంటలకొద్దీ ఏకరువు పెట్టినా బోధపడని విషయం, ఒక చక్కని ఉదాహరణతో సులువుగా అర్థమవుతుంది**

# తెలంగాణాలో నాబార్డ్‌చే100 'వాష్' అవగాహన సదస్సులు

– నాగవర్ధన్



గాంధీ జయంతి సందర్భంగా 2020 అక్టోబర్ 2వ తేదీన నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం 'వాష్' కార్యక్రమంపై (నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత) నిర్వహించిన సమావేశానికి జిల్లా కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు, స్వయం సహాయక సంఘ మహిళలు హాజరయ్యారు.

నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీ వై కే రావు మాట్లాడుతూ ఇప్పుడున్న కోవిడ్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 'వాష్' కార్యక్రమంపై తెలంగాణా రాష్ట్రంలో 100 అవగాహన సదస్సులను నాబార్డ్ నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఏపిమాస్ కు 20 వాష్ అవగాహన సదస్సుల నిర్వహణ భాధ్యతను అప్పగించారు.

జి ఎంహెచ్ సి జాయింట్ కమిషనర్ సంధ్యగారు మాట్లాడుతూ 'వాష్' వ్యక్తిగత ఆవశ్యకతను గురించి, ఇంటి దగ్గరే మరుగుదొడ్డి వల్ల కలిగే ఉపయోల గురించి, పెరిగే మహిళా ఆత్మ గౌరవం గురించి వివరించారు. 'వాష్' కార్యక్రమంలో మరుగుదొడ్డి నిర్మాణం ఒక ఆరోగ్య పెట్టుబడి అని, ఒక చిన్న ప్రయత్నమే పెద్ద పురోగతిని సాధిస్తుందని తెలిపారు.

అనంతరం సంధ్య గారు 'వాష్' పై అవగాహన కార్యక్రమాల నిర్వహణ కోసం నాబార్డ్ తెలంగాణా, ప్రాంతీయ కార్యాలయానికి, ఏపిమాస్ కు మధ్య కుదిరిన ఒప్పందం పత్రాలను ఏపిమాస్ ప్రతినిధులు నవీన్ గారికి, భవానీ గారికి అందించారు.




ఈ కార్యక్రమంలో నవీన్ గారు, బ్రహ్మచారి గారు, జిల్లా కార్యకర్తలు, వర్ధన్ గారు, రోజ్ మేరీ గారు, రాణి గారు స్వయం సహాయక సంఘ మహిళలు, తదితరులు పాల్గొన్నారు. ■

ఇవ్వగలిగినదాని కంటె ఎక్కువ ఇవ్వడం ఔదార్యం, అవసరమైనదానికంటె తక్కువ తీసుకోవడం గౌరవం

# మహోత్సాహంగా మహిళా రైతు దినోత్సవం!

(6వ పేజీ తరువాయి)

- ఎఫ్.పి.ఓలో మహిళా సభ్యులు సగభాగం ఉండాలి.
- సంస్థలో ఏ విధమైన కమిటీలు ఏర్పాటు చేసినా అందులో మహిళలకు తప్పక స్థానం ఉండాలి.
- మండల, జిల్లా స్థాయిలో మహిళలతో ఒక కమిటి ఏర్పాటు చేసి, ఆ కమిటీ ప్రభుత్వ కార్యక్రమాలు, సంస్థ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేలా చూడాలి.

సభకు హాజరైన ప్రజా ప్రతినిధులు, సిబ్బంది మాట్లాడుతూ మహిళా రైతులకు ప్రత్యేకమైన గౌరవం, ప్రాధాన్యం యివ్వాలని, వారు అన్నిటా ముందడుగు వేసేలా చూసే బాధ్యత అందరిపైన ఉందని, అందుకోసం ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు సహకరిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో నలుగురు మహిళా రైతులకు ఉత్తమ మహిళా రైతులుగా అవార్డులు ప్రదానం చేశారు. వచ్చే సంవత్సరంలో నలుగురికి బదులు కనీసం నలభైమంది మహిళా రైతులు ఉత్తమ మహిళా రైతులుగా పురస్కారం అందుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మహిళా రైతులు, ఎఫ్.పి.ఓ పాలక వర్గం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఏపిమాస్ సిబ్బంది పాల్గొని సభను విజయవంతం చేశారు.

**అనంతపురం జిల్లాలో ...**

**ఏ**పిమాస్ నిర్వహణలోని 'క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్' ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా గుడిబండ, నల్లమాడ మండలాలలో 'మహిళా రైతుల దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించారు. మహిళలు కుటుంబ, సమాజ అభివృద్ధిలో కీలకమైన పాత్ర వహిస్తారు. ఇల్లు, వాకిలి, వంట, పిల్లలు, పశువులు, పాలు పిండడం, జీవాలు, గడ్డి, బయటి పనులు, ఉద్యోగం, పొలం చూసుకోవడం వంటి అనేక పనులలో మహిళ అన్నీ తానై ఉంటుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, పారిశ్రామిక, సమాచార, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాలలో మహిళలు రాణించారు. అందుకే మహిళ అంటే అబల కాదు సబల అని అందరూ ఆమోదించినదే. ఈ కోవలో రైతు మహిళల సేవలకు గుర్తింపుగా, ప్రోత్సాహంగా 'మహిళా రైతుల దినోత్సవాన్ని' నిర్వహించారు.

గుడిబండ మండలం క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు పరిధిలోని మందలపల్లిలో నిర్వహించిన ఈ మహిళా రైతు దినొత్సవంలో 40మంది మహిళా రైతులు, వ్యవసాయ, ఉద్యానశాఖ, రైతు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. గుడిబండ మండల వ్యవసాయ అధికారి శ్రీ తిమ్మప్ప,



మందలపల్లి రైతు నాయకులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. నల్లమాడలో నిర్వహించిన 'మహిళా రైతుల దినోత్సవా'నికి 30 మంది మహిళా రైతులు, రైతు సంఘం నాయకులు, సిబ్బంది, ప్రాజెక్టు సిబ్బంది హాజరయ్యారు. ఈ సమావేశాలకు హాజరైన మహిళలు వ్యవసాయ రంగంలో వారు వినూత్నంగా చేబట్టిన ముంగారు విత్తనం, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం, కూరగాయల తోటలు, వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాల గూర్చి, వ్యవసాయంలో మహిళల పాత్ర గూర్చి ప్రసంగాల రూపంలో, పాటల రూపంలో చక్కగా తెలియచేశారు.

వ్యవసాయంలో పెట్టుబడిని తగ్గించి స్థానికంగా లభించే సేంద్రియ పదార్థాలతో, మన దగ్గర ఉన్న విత్తనాలు, ఆవు గంజు, పేడ, కషాయాలతో వ్యవసాయం చేయడం వలన పెట్టుబడులు తగ్గి, పంట ఆరోగ్యంగా ఉండి, దిగుబడి పెరిగి ఆదాయం పెరుగుతుంది అని మండల వ్యవసాయ అధికారి శ్రీ తిమ్మప్ప వివరించారు.

**తను పడే పాట్లనుంచే కాదు, ఇతరుల వైఫల్యాలనుంచి కూడా పాఠాలు నేర్చుకోవడం వివేకవంతుల లక్షణం**

తమ పిల్లలను ముఖ్యంగా బాలికలను అన్ని రంగాలలో నైపుణ్యవంతులుగా చేయగలిగే అవకాశం తల్లులకు ఉంటుంది కాబట్టి ప్రతి మహిళా రైతు వారి పిల్లల అభివృద్ధికి బాగా కృషి చేయాలని రైతు నాయకులు శ్రీ నాగరాజు పేర్కొన్నారు.

మహిళా రైతులైతే తమ కుటుంబానికి కావలసిన విధంగా ఆరోగ్యకరమైన పంటలను పండిస్తారు. పర్యావరణ అనుకూల విధానాలను పాటిస్తారు. విత్తు విత్తే సమయం నుండి కోత వరకు అన్ని సమయాలలోనూ ముఖ్య పాత్ర వహిస్తారు. అలాంటి మహిళలకు ఒకరోజు కేటాయించి వారి కృషిని గుర్తించి వారిని సన్మానించడం మహిళలందరిని, రైతులందరినీ సన్మానించినట్టే అని ఏపీమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ గోపాలరాజు మహిళా రైతులను అభినందించారు.

ప్రతి పంచాయతీలోనూ ఆదర్శ మహిళా రైతుగా ఎంపికైన వారు వ్యవసాయంలో తాము చేపట్టిన వినూత్న కార్యక్రమాలను గురించిన తమ అనుభవాలను సమావేశంలో పంచుకున్నారు. వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. ఈ సారి మహిళా రైతుల దినోత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహించుకోవాలని, సమావేశానికి హాజరైన వారందరికీ ఏపీమాస్ సిబ్బంది గోపాలరాజు, రాజశేఖర్, అనిల్ ధన్యవాదాలు తెలియ జేయడంతో సమావేశం ముగిసింది.

**రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ...**

**అ**నంతపురం జిల్లా కురుగుంట గ్రామంలో అక్టోబర్ 15 వ తేదీన మహిళా రైతుల దినోత్సవాన్ని, మధ్యాహ్నం నుండి 'అనంత గ్రామీణ మహిళా రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం' రెండవ వార్షిక మహాసభను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీ గంధం చంద్రుడు ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో 100 మంది రైతులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ గారితోపాటు జె డి ఎ (పిపి) గారు, ఎ డి ఎ గారు, ఎ ఓ గారు, ఎ ఇ ఓ, ఎం పి ఇ ఓ, వి ఎ ఎ లు, ప్రిన్సిపల్ సెక్రటరీ కె వి కె, సైంటిస్ట్ కె.వి.కె, గ్రామ సెక్రటరీలు, ఎఫ్ పి ఓ డైరెక్టర్లు, సభ్యులు, ఉమ్మడి వ్యవసాయం చేస్తున్న మహిళలు, రైతు ఆత్మహత్య కుటుంబాల సభ్యులు, ప్రైవేట్ టీచర్లు, మహిళా రైతులు, ఏపిమాస్ సిబ్బంది, ఎఫ్ పి ఓ డైరెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సమావేశానికి హాజరైన వారిలో 10 మంది ఎఫ్ పి ఓ డైరెక్టర్లను, కలెక్టివ్ ఫార్మింగ్ మహిళా రైతులను, రైతు ఆత్మహత్యల కుటుంబాల సభ్యులను, ప్రైవేట్ టీచర్లను, ఉత్తమ రైతులను చిరుధాన్యాల బొకేలతోను, శాలువలతోను సన్మానించారు.

- మహిళా రైతుల 8 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మహిళా రైతుల సంతకాలతో కలెక్టర్ గారికి అందించటం జరిగింది.



- ఎఫ్ పి ఓ డైరెక్టర్లు , ఎఫ్ పి ఓ స్థిర ఆస్తుల గురించిన వివరాలను కూడా కలెక్టర్ గారికి అందజేశారు.
- రైతు ఆత్మహత్యల కుటుంబాలతో మాట్లాడి జీవనోపాధులు, ఎక్స్‌గ్రేషియాకు సంబంధించిన వినతి పత్రాన్ని కలెక్టర్ గారికి అందించారు.

**కలెక్టర్ అభినందన**

కలెక్టర్ శ్రీ గంధం చంద్రుడు మాట్లాడుతూ 'రెడ్స్' సంస్థ చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. మహిళలు అందరూ చాలా చక్కగా ఎఫ్ పి ఓలను నడుపుతున్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో మీరు చేస్తున్న అన్ని పనులకు ప్రభుత్వం నుండి అన్ని రకాల సహకారాలు అందిస్తామని హామీ యిచ్చారు. మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను చాలా బాగా పాటిస్తున్నారని అభినందనలు తెలిపారు.

సమావేశంలో తనకు సమర్పించిన ప్రతిపాదనలు, విజ్ఞప్తులకు సంబంధించి త్వరగా పరిశీలించి, నివేదిక యివ్వాలని ఏ ఓ, జె డి పి పి, ఏ డి గారిని ఆదేశించారు.

**ఏ ఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ...**

**ఏ**.ఎఫ్.ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో అనంతపురం

చేతగాని వారిచేతలతో గొప్ప ఆశయాలుకూడా, బూడిదలో పోసిన పన్నీరవుతాయి

జిల్లాలోని కళ్యాణదుర్గం ఫీల్డ్ ఆఫీస్‌లో శెట్టూరు, కళ్యాణ దుర్గం, బెళుగుప్ప, కుందుర్పి మండలాలకు చెందిన 50 మంది మహిళా రైతులతో అక్టోబర్ 15 వ తేదీన 'మహిళా రైతుల దినోత్సవం' జరిగింది. నాబార్డు డి.డి.ఎం. శ్రీమతి ఉషా మధుసూదన్ ముఖ్య అతిథిగా నిర్వహించిన ఈ మహిళా రైతు దినోత్సవంలో మండల ఎ.ఓ.గారు, ఎ.ఎఫ్.ఎకాలజీ సిబ్బంది, ఎ.ఎఫ్.పి.ఓ.బి.ఓ.డి. మెంబర్లు, మండల సస్యమిత్ర సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. మొట్ట మొదటిసారిగా 'మకాం' సంస్థ ప్రోత్సాహంతో ఈ కార్య క్రమాన్ని నిర్వహించారు. అతిథులు, మహిళలు జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమం ప్రారంభమైంది. మహిళా రైతులు స్ఫూర్తిదాయకమైన పాటలతో, ప్రసంగాలతో వ్యవసాయంలో మహిళల ప్రాముఖ్యత, తమ శ్రమ గుర్తింపు కోసం వారెదుర్కొంటున్న సమస్యలను చక్కగా వివరించారు.

**పోరాడి హక్కులు సాధిద్దాం : నాబార్డ్ డి డి ఎం**

'మనం ఏమైనా పని చేసినపుడు ధైర్యంగా చెప్పగలగాలి. మహిళలుగా మన హక్కుల్ని మనమే పోరాటం చేసి సాధించుకోవాలి. ఆడపిల్లలకు ధైర్యాన్ని ఇవ్వాలి, ప్రోత్సహించాలి. అప్పుడే అందరూ మహిళలకు గుర్తింపు ఇవ్వడం మొదలుపెడతారు ' అని నాబార్డు డి.డి.ఎం. శ్రీమతి ఉషా మధుసూదన్ అన్నారు.

మనమందరం చిన్నప్పటి నుండే అమ్మాయిలను ఒకలాగా, అబ్బాయిలను ఒకలాగా పెంచుతాము. తేడాలు చూపిస్తామని ఉదాహరణలతో వివరించారు. ఈ సంవత్సరం జిల్లా కలెక్టరుగారు బాలికల దినోత్సవంరోజు ఆడపిల్లలను కలెక్టరుగా, పి.డి.గా అన్ని మండలాల్లో తహసిల్దార్‌లుగా అన్ని ఉన్నత స్థానాల్లో బాలికలకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించారు. చాలా మంచిగా అనిపించిందన్నారు. మహిళా రైతులు బ్యాంకుల దగ్గరకు వెళితే వారికి సమస్యలు వున్నాయన్న విషయం ఇప్పుడే తెలుసుకున్నామని, ఆ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని ఆమె అన్నారు. స్వచ్ఛత పరిశుభ్రతపై నాబార్డు పని చేస్తున్నదని, మహిళలు తమ ఆత్మ గౌరవాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడంకోసం ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను కట్టుకోవాలని, వాటిని వినియోగించాలని పిలుపు నిచ్చారు. ఇప్పటికి కూడా మరుగుదొడ్లు లేని కుటుంబాలు వున్నాయని, మరుగుదొడ్లు ఉన్నా వాడటం లేదని, నీటి సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నారని ఆ సమస్యల పరిష్కారానికి అందరం పని చేయాలని, వాటికి బ్యాంకులు కూడా రుణాలనిస్తాయని ఆమె తెలిపారు.

**గుర్తింపు లేదు - రిజ్వానా :** మకాం వేదిక ద్వారా మహిళల హక్కుల సాధనకై, గుర్తింపుకై చేసే ప్రయత్నాన్ని రైతు మహిళలు వివరంగా అర్ధం చేసుకున్నారని ఏ.ఎఫ్.ఎకాలజీ సెంటర్ జీవనోపాధుల కోఆర్డినేటర్ శ్రీమతి రిజ్వానా పేర్కొన్నారు. వ్యవసాయంలో మహిళలు 70%కి పైగా కష్టపడి పని చేస్తున్నప్పటికీ రైతుగా తనకంటూ ఆశించినంత స్థాయిలో గుర్తింపు లేదని మహిళా రైతులు ఆవేదన చెందుతున్నారని ఆమె తెలిపారు.

**ఎకాలజీ సెంటర్ అండ - హేమలత :** ఎ.ఎఫ్.ఎకాలజీ సెంటరులో చాలా సస్యమిత్ర సంఘాలున్నాయి. ఈ సంఘాలు మెట్ట వ్యవసాయ అభివృద్ధికై ఎక్కువగా కలిసి పనిచేస్తాయి. ఈ రైతు సంఘాలలో మహిళలకు సంస్థ వారు ప్రత్యేక స్థానం కల్పించి, మహిళా రైతుల గుర్తింపుకై పని చేయడం బాగుందని కళ్యాణదుర్గం మండలం ఎ.ఎఫ్.పి.ఓ అధ్యక్షురాలు శ్రీమతి హేమలత సంతోషం వ్యక్తం చేశారు.

**సభ్య రైతుల అభివృద్ధికి కృషి - సత్యమ్మ :** మా ఎ.ఎఫ్.పి.ఓ ద్వారా వ్యాపారాలు చేస్తున్నాం. మా ఎ.ఎఫ్.పి.ఓ.లో 70% వరకుమహిళలు వాటాదారులుగా వున్నారు. వారి అభివృద్ధికై మా ఎ.ఎఫ్.పి.ఓ. ఎప్పుడూ కృషి చేస్తుంది. అని శెట్టురు మండలం ఎ.ఎఫ్.పి.ఓ అధ్యక్షురాలు శ్రీమతి సత్యమ్మ తెలిపారు.

**ఆ గుర్తింపు సాధిద్దాం - శాంతమ్మ :** సంఘంలో చేరినప్పటి నుండి మహిళలు నాయకురాళ్ళుగా ఎదగాలని చెబుతూనే వున్నాము. కొంతమంది ముందుకు వచ్చి మంచిగా, చురుగ్గా పని చేస్తున్నారు. అయినా బ్యాంకుల దగ్గరకు వెళ్ళినపుడు మహిళా రైతులుగా వారికి గుర్తింపు ఇవ్వడం లేదని బెళుగుప్ప మండలం ఎ.ఎఫ్.పి.ఓ. అధ్యక్షురాలు శ్రీమతి

శాంతమ్మ పేర్కొన్నారు. మహిళా సంఘాలలో పొదుపులు చేసుకుంటున్నప్పుడు ఇచ్చే గుర్తింపు, మహిళా రైతుగా ఏమైనా అవసరం అయినప్పుడు అప్పులకై వెళితే ఆడవారిని రైతులుగా గుర్తించడం లేదని తెలిపారు. ఈ మార్పుకై మనం పని చేయాలని ఆమె కోరారు.

**అప్పులు యిప్పించాం–లింగమ్మ:** అనంతపురం జిల్లాలో గత 3 సంవత్సరాల నుండి వర్షాలు లేక పంటలు పండలేదు. ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువై పంట మొత్తం నష్టం జరిగింది. ఇలాంటి పరిస్థితులలో మహిళలకు చాలా ఇబ్బంది. మా సంఘం తరపున బ్యాంకు వారి దగ్గరకు వెళ్ళి 15 మందికి ఆవులకై లోన్లు ఇప్పించామని ఎ.ఎఫ్.పి.ఓ. సభ్యురాలు శ్రీమతి లింగమ్మ పేర్కొన్నారు. వ్యవసాయంలో నష్టం వచ్చినా పశువుల ద్వారా అయినా కొంతవరకు ఆదాయం సంపాదించి కుటుంబాలను పోషించుకోవాలని సంఘాలలో చర్చలు చేస్తున్నామన్నారు.

**మగవాళ్ళ ష్యూరిటీ కావాలట–వన్నూరమ్మ:** నేను ఒంటరి మహిళను. పెళ్ళి అయిన 6 సంవత్సరాలకే భర్తచనిపోయారు. నాకు ముగ్గురు కూతుళ్ళు. వ్యవసాయ పొలం మా మరిది నుండి తీసుకోవడానికి చాలా కష్టపడ్డాను. బ్యాంకు రుణాలకు పోతే బ్యాంకువారు మీ మరిదిని కాని, మీ ఇంట్లో వున్న మగవారిని కాని ష్యూరిటీ యివ్వాలని అడుగుతున్నారని కళ్యాణదుర్గం ఎం.ఎస్.ఎం. ఎస్. కన్వీనర్ శ్రీమతి వన్నూరమ్మ ఆవేదనతో చెప్పారు. తాను ఎన్నో ఇబ్బందులు పడ్డానని, పంటను పండిస్తాను, అమ్ముతాను కానీ రైతుగా ఎందుకు గుర్తించడం లేదని ఆమె బాధపడ్డారు.

**బాల్య వివాహాలను ఆపుదాం–లక్ష్మీదేవి:** ఈ నాలుగు మండలాల్లో ఆడపిల్లలకు చిన్న వయస్సులోనే పెళ్ళిళ్ళు చేస్తున్నారు. వాటిని మనం అరికట్టాలి. లేకపోతే ఆడపిల్లలకు అనేక జబ్బులు వచ్చి వారు మానసికంగా ఎదగలేరని గంగవరం ఆశావర్కర్ శ్రీమతి లక్ష్మీదేవి పేర్కొన్నారు. గ్రామాలలో మహిళలు కరోనా సమయంలో చాలా శుభ్రతను, భౌతికదూరాన్ని పాటించాలని ఆమె కోరారు.

**16 రోజుల ప్రచారోద్యమం: నిమ్మనపల్లి**

నిమ్మనపల్లె మండలంలోని చౌకిళ్లవారిపల్లెలో ప్రపంచ గ్రామీణ మహిళా రైతు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఉపాధ్యక్షురాలు కె.శోభ గారు మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయంలో ప్రతి స్థాయిలోనూ కూలీలుగా, రైతులుగా మహిళలు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అలాంటివారిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 16 రోజుల ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ■

## సి ఆర్ పి ఇ పిలకు శిక్షణ

– బి. వెంకన్న

**భ**ద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్ వి ఇ పి కార్య క్రమానికి సంబంధించి సిఆర్‌పిఇపి లకు 6రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. 4 మండలాలకు (చంద్రు గొండ, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి, ముల్కలపల్లి) చెందిన, సి ఆర్ పి ఇ పి లు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణ ప్రాధాన్యాన్ని గురించి ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ ఎన్.మధుమూర్తి వివరించారు. సీతారామ బ్లాక్ వనరుల కేంద్రం పాలకవర్గ సభ్యులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమం ముఖ్య అంశాలు:

1. వ్యాపారం అంటే ఏమిటో చర్చించడం జరిగింది
2. వ్యాపార రకాలు, హెచ్చుతగ్గుల గురించి
3. వ్యాపార సాధ్యత ఫ్రేమ్‌వర్క్, అవకాశ వ్యయం గురించి.
4. వినియోగదారులు అవగాహన గురించి, వారి రకాల గురించి, వారి అవసరాలు గురించి
5. నాణ్యమైన ఉత్పత్తులు, పోటీదారుల గురించి.
6. వ్యాపార ఉత్పత్తుల, సేవల ఎంపిక గురించి.
8. ఎస్ వి ఇ పి యాప్ లో వ్యాపార ప్రణాళికను నమోదు చేసే విధానాన్ని గురించి వివరించడం జరిగింది.

వినియోగదారుల రకాలు, అవసరాలపై సమూహ కార్యాచరణ (గ్రూప్ యాక్టివిటి) నిర్వహించి, ప్రదర్శన జరిపారు.

# పాలమూరు జిల్లాలో కోటి విత్తన బంతుల సంరంభం!

– ఎస్. శారద, ఎ.నాగమల్లిక, జి.శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లాలో అడవుల శాతం తక్కువ. కాబట్టి అడవులను పరిరక్షించడంలో భాగంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలను ఇచ్చే విత్తన బంతుల తయారీలోనూ మేము ఉన్నామని పాలమూరు జిల్లా మహిళా సమాఖ్యలోని 284 గ్రామ సంఘాలు, 5880 సంఘాలు, 69,200 మంది సభ్యులు సామాజిక బాధ్యతగా స్వీకరించి,'కోటి విత్తన బంతుల తయారీ'




కార్యక్రమాన్ని కేవలం తొమ్మిది రోజుల అతి తక్కువ సమయంలో (28.07.2020 నుండి తేది.05 .07.2020 వరకు) ఒక మహా యజ్ఞంగా నిర్వహించారు. సాధించాలనే తపన వుంటే ఐకమత్యంతో సాధ్యం కానిది ఏదీ లేదని నిరూపించారు. సామాజిక అడవులతో అటవీ విస్తీర్ణాన్ని, పచ్చదనాన్ని పెంపొందించడం, వున్న అడవులను దట్టమైన అడవులుగా చేయడం, పర్యావరణ సమతుల్యతను మెరుగు పరచడం ద్వారా వర్షపాతాన్ని పెంచాలన్న మంచి సంకల్పంతో 'కోటి విత్తన బంతుల' కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా నిర్వహించారు.

ఈ విత్తన బంతుల కార్యక్రమం జిల్లా కలెక్టర్ శ్రీ ఎస్. వెంకట్ రావు ఆలోచనకు కార్యరూపం. 26.06.2020 తేదీన జిల్లా సమాఖ్య టిటిడిసి నందు అటవీశాఖ జిల్లా అధికారి (డిఎఫ్ఓ), డి.ఆర్.డి.ఓ, డి.ఆర్.డి.ఎ ఆధ్వర్యంలో విత్తనబంతుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సిసి, ఏపిఎం, జడ్ఎస్, ఎంఎస్ ఓబిఎస్, డిపిఎంలు పాల్గొన్నారు.

**విత్తన బంతుల ఉపయోగం**

- విత్తన బంతుల తయారీ అనేది ముఖ్యంగా కొండ ప్రాంతాలను, బోడి కొండలను నవీకరణ చేయడానికి, తద్వారా అడవులను పెంపొందించడానికి చేపట్టే ప్రక్రియ.
- నేలను తవ్వి, విత్తనాలను నాటడానికి అనుకూలంకాని ప్రదేశాలలో ఈ విత్తన బంతుల విధానాన్ని అనుసరిస్తారు. విత్తనానికి కావలసిన పోషకాలను జోడించి విత్తు నుండి మొక్కగా, మొక్క నుండి మానుగా, మానునుండి అడవిగా మార్చుటకు ఈ "విత్తన బంతులు" ఉపయోగపడుతాయి.

**ఈ విత్తన బంతులకు కావలసిన పదార్థాలు**

1. ఎర్ర మట్టి (జల్లెడ పట్టినది – 70%)
2. జల్లెడ పట్టిన పశువుల ఎరువు 30%
3. జీవామృతం (స్వదేశీ ఆవు మూత్రం, పేడ, బెల్లం, శనగ పిండి, నీళ్ళు)
4. విత్తనాలు (నాణ్యమైనవి)
5. ప్లాస్టిక్ తట్టలు (మిశ్రమాన్ని తయారు చేయుటకు)
6. విత్తన బంతులను నీడలో ఆరబెట్టుటకు కావల్సిన సంచులు
7. విత్తన బంతులను నిల్వ వుంచు గోనె సంచులు.

**విత్తన బంతుల తయారీ విధానం**

ముందుగా జల్లెడ పట్టిన ఎర్రమట్టిలో జల్లెడ పట్టిన పశువుల ఎరువును, తగినంత గోమూత్రాన్ని కలపాలి.

మంచి నడవడిక అనేది ఎవరో ఇచ్చే కానుక కాదు. ఎవరికివారు అనుసరించి, సాధించవలసిన విజయం



సిద్ధం చేసుకున్న ఈ మిశ్రమాన్ని విత్తన పరిమాణాన్ని బట్టి ఉండలుగా (బంతులుగా) తయారు చేసుకోవాలి. ఇలా తయారు చేసుకున్న బంతులలో విత్తనం పరిమాణాన్నిబట్టి బంతి మధ్యలో విత్తనాన్ని వుంచి, తిరిగి గుండ్రంగా తయారు చేసుకోవాలి.

తయారయిన విత్తన బంతులను (24 నుండి 28 గంటలలో) ప్లాస్టిక్ కాగితంపై ఉంచి 4, 5 రోజుల పాటు నీడలో ఆరబెట్టాలి. ఆరిన విత్తన బంతులను గోనె సంచులలో నిల్వ ఉంచుకోవాలి.

వాతావరణం అనుకూలించినప్పుడు విత్తన బంతులను నిర్దేశించిన ప్రదేశాలలో (వర్షం పడిన) రోజు, మరుసటి రోజు విసరి వేయాలి. ఏయే ప్రాంతాలలో ఏఏ రకపు విత్తన బంతులను ఎన్ని విసిరింది లెక్క చూసుకోవాలి.

ఒక ప్రాంతంలో ఒకేరకమైన జాతి మొక్కలు కాకుండా వేరువేరు జాతుల విత్తన బంతులను ఉపయోగిస్తే అన్ని రకాల మొక్కలు అందుబాటులోకి వస్తాయి.

ఈ విత్తన బంతుల కార్యక్రమం అడవుల దీర్ఘ కాల అభివృద్ధిలో భాగంగా ముందు తరాలకు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.

**జిల్లా మహిళా సమాఖ్య ప్రణాళిక**

ప్రతి మండలానికి ఎనిమిది లక్షల విత్తనబంతుల వంతున మొత్తం 1.12 కోట్ల విత్తనబంతుల తయారీని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అయితే అంతకు మించి మొత్తం కోటీ 14 లక్షలు విత్తన బంతులను తయారు చేశారు.

**మండలాలవారీగా విత్తనబంతుల తయారీ వివరాలు:**

| వ.నెం. | మండలం పేరు | విత్తన బంతులలక్ష్యం | తయారీ, వినియోగం సంఖ్య |
|---|---|---|---|
| 1 | అడ్డకల్ | 8 లక్షలు | 821828 |
| 2. | బాలానగర్ | 8 లక్షలు | 850860 |
| 3. | బూత్పూర్ | 8 లక్షలు | 670430 |
| 4. | సిసి కుంట | 8 లక్షలు | 882725 |
| 5. | దేవరకొండ | 8 లక్షలు | 801000 |
| 6. | గండీడ్ | 8 లక్షలు | 822158 |
| 7. | హన్వాడ | 8 లక్షలు | 969000 |
| 8. | జడ్చర్ల | 8 లక్షలు | 827000 |
| 9. | కోయిల్కొండ | 8 లక్షలు | 812000 |
| 10. | మహబూబ్నగర్ | 8 లక్షలు | 796000 |
| 11. | మిడ్జిల్ | 8 లక్షలు | 750000 |
| 12. | మూసాపేట్ | 8 లక్షలు | 806000 |
| 13. | నవాబ్పేట్ | 8 లక్షలు | 869060 |
| 14. | రాజాపూర్ | 8 లక్షలు | 810000 |
| | మొత్తం | 112 లక్షలు | 11488061 |

**ఉపయోగించిన విత్తనాల రకాల వివరాలు**

| క్ర.సం | విత్తనం పేరు | పంపిణీ చేసిన విత్తనాలు |
|---|---|---|
| 1 | చింత | 1992090 |
| 2 | సీతాఫలం | 1721243 |
| 3 | జువ్వి | 894646 |
| 4 | రావి | 884556 |
| 5 | నల్ల తుమ్మ | 823380 |
| 6 | మర్రి | 922180 |
| 7 | మేడి | 782180 |
| 8 | నెమలి నేర | 80808 |
| 9 | వేప | 2065477 |
| 10 | ఇతరములు | 159517 |
| | | 10326077 2020 |

(మిగతా 25వ పేజీలో)


# అనేక రాష్ట్రాలలో శ్రీనివాస్ శిక్షణలు!

**– కామారెడ్డి స్వయం నియంత్రణ ఉద్యమ బృందం**

*శ్రీ గోమాస్ శ్రీనివాస్ ఏపిమాస్ ఉద్యోగిగా తాను వ్యక్తిత్వ వికాసంతోసహా వివిధ అంశాలపై ఎన్నో రాష్ట్రాలతోపాటు, జర్మనీ దేశంలో కూడా శిక్షణలు పొంది మంచి శిక్షకుడిగా ఎదిగారు. బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, తదితర రాష్ట్రాలకు చెందిన వేలాదిమందికి శిక్షణలు యిచ్చారు. ఆ రాష్ట్రాలకు వెళ్ళి కూడా అక్కడి స్వయంసహాయ సంస్థల స్థితిగతులను అవగాహనచేసుకుని తన శిక్షణలకు మెరుగులు దిద్దుకున్నారు. ఇతర రాష్ట్రాలలోని సంస్థలకు, సభ్యులకు అండగా నిలవడానికి ఆ భాషా పరిజ్ఞానం కలిగిన రిసోర్స్ పర్సన్స్‌ను తయారుచేసి ఆ రాష్ట్రాలకు పంపి, స్వయంసహాయ ఉద్యమ విస్తృతికి, బలోపేతానికి తనవంతు కృషి చేశారు. స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు.*

---

**ఉ**మ్మడి అదిలాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్ పట్టణంలో శ్రీ గోమాస్ లింగయ్య, శ్రీమతి గంగాబాయి దంపతులకు 1974 డిసెంబర్ 1న జన్మించిన శ్రీ గోమాస్ శ్రీనివాస్ సామాజిక శాస్త్రంలో పట్టా పొంది తను నేర్చిన విద్యకు తగిన, తనకు నచ్చిన సేవా రంగంలో తన జీవనయానాన్ని సాగిస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పేదలవాడల అభివృద్ధి ప్రాజెక్ట్‌లో సముదాయ సమన్వయకర్తగా నియామకంతో 1998లో శ్రీ గోమాస్ శ్రీనివాస్ ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. అనంతరం గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రాజెక్ట్ (సెర్ప్) లో జిల్లా రిసోర్స్ పర్సన్‌గా ఆదిలాబాద్ జిల్లాలో సేవలందించిన శ్రీ శ్రీనివాస్ 2005 అక్టోబర్‌లో ఏపిమాస్ సంస్థలో సి.బి.ఓ గా చేరి అనేక ప్రాజెక్ట్‌లు, అధ్యయనాలు, శిక్షణలు, క్షేత్ర సందర్శనలు నిర్వహించారు.






కొంతకాలం అఫిలియేట్‌గా, ఆ తర్వాత సి.బి.ఓగా ఏపిమాస్‌లో ఉద్యోగ పర్వం ప్రారంభించిన శ్రీ శ్రీనివాస్ ప్రాజెక్ట్ మేనేజర్ స్థాయికి ఎదిగి, ప్రస్తుతం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌గా పదోన్నతి పొంది, మహిళా సంస్థల, రైతు సంస్థల అభివృద్ధికి ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో సేవలందిస్తూ తన సేవారంగ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాలలో సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ)తో పాటు బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల గ్రామీణ ప్రాంత సముదాయ అభివృద్ధి కార్యక్రమం క్షేత్రస్థాయి సిబ్బందికి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి సిబ్బందికి, కార్యకర్తలకు సముదాయ సభ్యులకు, నాయకులకు అనేక రకాల శిక్షణలు ఇచ్చి వారు తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను పెంచుకునేలా చేశారు. తను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుండి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లను తయారుచేసి వారిని వివిధ రాష్ట్రాలకు పంపించి అక్కడి సంస్థల అభివృద్ధికి దోహద పడ్డారు. ఏపిమాస్ ద్వారా నిర్వహిస్తున్న స్వయం నియంత్రణ ఉద్యమం ప్రాజెక్ట్‌లో ఒక ముఖ్య భూమిక పోషిస్తున్నారు. బీహార్‌లో చేస్తున్న

నీ తోటివారు నిన్ను చూస్తారు, రాబోయే తరాలవారు నీ ప్రతిభను చూస్తారు

ఇ అండ్ వై ప్రాజెక్ట్‌కు టీం లీడర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఏపిమాస్ సంస్థలోని అన్ని స్థాయిల వారితో కలిసి సానుకూల స్నేహ దృక్పథంతో అనేక బృంద కార్యక్రమాలను విజయవంతంగా నెరవేర్చారు. ఈ 22 సంవత్స రాలలో వివిధ సంస్థలలో పని చేయటానికి ఎంతోమంది సామాజిక కార్యకర్తలను, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లను, ప్రొఫెషనల్ రిసోర్స్ పర్సన్‌లను తయారుచేసి యిటు అభివృద్ధిరంగం బలపడడానికి, ఆటు పలువురు ఈ రంగంలో ఉపాధి పొమదడానికి దోహదకారి అయ్యారు. వీరి సేవారంగ సేవా ప్రస్థానంలో ముఖ్య ఘట్టాలను ఒకసారి పరిశీలిద్దాం.



జర్మనీలో అవగాహన పర్యటన

1998 సంవత్సరం నుండి 2005 సంవత్సరం వరకు (ఏపిమాస్‌లో చేరకముందు) ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోను, అన్నిమండల గ్రామీణ ప్రాంతాలలోను జిల్లా రిసోర్స్ పర్సన్‌గా పనిచేసి సుమారు 2000 మంది సామాజిక కార్యకర్తలు, సి.ఆర్.పి లు, ప్రాజెక్ట్ సిబ్బంది, సమాఖ్యల నాయకురాళ్ళకు స్వయం సహాయక సంఘాల, గ్రామ సంఘాల, మండల సమాఖ్యల, జిల్లా సమాఖ్యల నిర్వహణ, పుస్తక నిర్వహణ, ఆర్థిక వరనరుల నిర్వహణ, నాయకత్వం మొదలగు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

**జర్మనీలో శిక్షణ**

- జర్మనీ దేశానికి చెందిన డి.జి.ఆర్.వి సంస్థ ఆధ్వర్యంలో ఏపిమాస్ ప్రతినిధిగా జర్మనీ దేశం వెళ్లి అక్కడి సహకార విధానంపై శిక్షణ పొందారు.
- తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోని మహిళా సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో క్షేత్ర సందర్శనకు వెళ్లి అక్కడి విషయాలు సంస్థల నిర్వహణ మొదలగు అంశాలు నేర్చుకున్నారు.
- గుజరాత్ రాష్ట్రంలో ఐ.యస్.యం.డబ్లు ద్వారా శిక్షకులకు శిక్షణ, ఆర్థిక సాక్షరతపై శిక్షణ పొందారు
- ఏపిమాస్ – కెనడాలోని 'కోడి' సంస్థ సంయుక్తంగా శిక్షణ పద్ధతులపై నిర్వహించిన శిక్షణ పొందారు
- సహభాగ శిక్షణ పద్దతులపై ఏపిమాస్ ద్వారా హైదరాబాద్‌లో, ఉత్తరప్రదేశ్‌లో సహభాగి శిక్షణ కేంద్రంలో, అనంతపురంలో ప్రియా వారి ద్వారా శిక్షణ పొందారు
- రైతు ఉత్పత్తిదారుల సంస్థల నిర్వహణ, వ్యాపార ప్రణాళికపై శిక్షణ పొందారు
- సెర్ప్ ద్వారా, ఏపిమాస్ ద్వారా స్వయం సహాయ సంఘాలు, గ్రామ, మండల, జిల్లా సమాఖ్యల, సంస్థల నిర్మాణం, నిర్వహణపై ఆదిలాబాద్ జిల్లాలో, హైదరాబాద్‌లో శిక్షణ పొందారు. జీవనోపాధుల పెంపుదల, వాటర్‌షెడ్‌ల నిర్వహణ, నాయకత్వం, సూక్ష్మ ఋణ ప్రణాళిక, మాక్స్ యాక్ట్, సహకార సంస్థల రిజిస్ట్రేషన్ మొదలగు అంశాలపై శిక్షణ పొందారు
- స్వయం సహాయక సంఘాల, సమాఖ్యల అకౌంటింగ్, పుస్తక నిర్వహణపై ఆదిలాబాద్‌లో, హైదరాబాద్‌లో శిక్షణ పొందారు.
- వెలుగు ప్రాజెక్ట్‌లో జెండర్, వివిధ సామాజిక అంశాలు,



*బీహార్‌లో బి ఆర్ ఎల్ పి ఎస్ సిబ్బందికి శిక్షణ*

వివిధ ఉప కమిటీలపైన, ఇందిరా క్రాంతిపథంలో శిక్షకులకు శిక్షణ కార్యక్రమం, మహిళా సంఘాలు, సమాఖ్యలపైన శిక్షణ పొందారు.

- సంస్థలలో, సంఘాలలో సాంస్కృతికపరమైన అంశాలు, సభ్యులకు విషయాలను ఏవిధంగా చేరవేయాలి, సంఘాలకు ఏవిధంగా ఫెసిలిటేషన్ చేయాలి అని సాంస్కృతిక, కమ్యూనికేషన్, ఫెసిలిటేషన్ పైన శిక్షణ పొందారు.
- స్వయం నియంత్రణ ఉద్యమం అంశాలపై శిక్షణ పొందారు.
- పార్టిసిపేటరీ మైక్రో లెవల్ ప్లానింగ్ అండ్ పార్టిసిపేటరీ ఐడెంటిఫికేషన్ ఆఫ్ పూర్' అనే అంశంపై డిపిఐపి ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లాలో శిక్షణ పొందారు.

**వేలాదిమందికి శిక్షణలు**

తాను పొందిన వివిధ శిక్షణల ఆధారంగా గడచిన 22 సంవత్సరాలలో స్వయం సహాయక సంఘ సభ్యులకు, సమాఖ్య నాయకులకు, సమాఖ్యల సిబ్బందికి, సామాజిక కార్యకర్తలకు, ప్రాజెక్ట్ సిబ్బందికి వివిధ రకాలైన శిక్షణలు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల సంఘ, సమాఖ్య నాయకులకు, సిబ్బందికి క్షేత్ర సందర్శనలు నిర్వహించారు. వీటితోపాటు వివిధ అంశాలపై కార్యశాలల నిర్వహణ, వివిధ కరదీపికల తయారీ, అధ్యయనాలు మొదలగు కార్యక్రమాలను కూడా శ్రీ స్రినివాస్ సమర్ధంగా నిర్వహించారు. సంక్షిప్తంగా వాటి వివరాలు :

- 1998 నుండి 2004వరకు కాగజ్‌నగర్‌లో నగరపాలక సంస్థ సముదాయాల అభివృద్ధికి, ఆదిలాబాద్ జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు, గ్రామ సంఘం, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య సభ్యులకు నాయకులకు, సంస్థల కార్యకర్తలకు, సిబ్బందికి, కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్‌లకు దాదాపు 4000 మందికి సంఘాల ఏర్పాటు, సంస్థల నిర్వహణ, పుస్తక నిర్వహణ, అకౌంటింగ్, ఆడిట్ నాయకత్వం, చట్టపరమైన కార్యక్రమాలు మొదలగు అంశాలపై శిక్షణలు, క్షేత్ర సందర్శనలు నిర్వహించారు.
- 2005 నుండి 2010 వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల క్లస్టర్‌లోని ఐదు మండలాలలో సెర్ప్ సహకారంతో ఏపిమాస్ తరపున కెపాసిటీ బిల్డింగ్ ఆఫీసర్‌గా పనిచేసి సంఘాలు, సమాఖ్యల బలోపేతంలో భాగంగా దాదాపు 2000 మందికి పైగా వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు.
- 2010 నుండి 2012 వరకు ఏపిమాస్ అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుండి ఒరిస్సా రాష్ట్రం లోని కోరాపుట్ జిల్లాలో మిషన్ శక్తి సంస్థతో, మధ్యప్రదేశ్ రాష్ట్రం లోని ఖాండ్వా జిల్లాలో ఆగాఖాన్ సంస్థతో కలిసి పని చేసి అక్కడి ఏపిమాస్ సిబ్బందికి సహకారం అందించడంతో పాటు, అక్కడి సంస్థల సంఘాల బలోపేతం కోసం పాటుపడ్డారు. రెండు రాష్ట్రాలలోని రెండు జిల్లాలోని సంఘాల, సభ్యుల, సంస్థల సిబ్బందికి, నాయకురాళ్ళకు కలిపి దాదాపు 1000 మందికి శిక్షణలు, క్షేత్ర సందర్శనలు నిర్వహించారు.
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి క్లస్టర్‌లో ఏపిమాస్ అక్కడి సంఘాలు, సమాఖ్యలతో చేస్తున్న ఒక బృహత్తరమైన కార్యక్రమం "స్వయం నియంత్రణ ఉద్యమం". ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు మండలాలను కలిపి "కామారెడ్డి పర్యవేక్షణ సమాఖ్య" ఏర్పాటు చేయటంలో తన తోటి సిబ్బందితో, పై అధికారులతో కలిసి కీలక పాత్ర పోషించారు. అభివృద్ధిలో తీసుకరావటానికి కృషి చేశారు.

**దురదృష్టమని మనం కుమిలిపోయేది నిజానికి, మన నిర్లక్ష్యం, చేతగానితనం, అవివేకం, అశ్రద్ధల ఫలితమే సుమా!**

- కామారెడ్డిలో పర్యవేక్షణ సమాఖ్య ఏర్పాటు అనంతరం ''స్వయం నియంత్రణ ఉద్యమం" లో భాగంగా సొంత కార్యకర్తలను ఏర్పాటుచేసే క్రమంలో ఎన్నో శిక్షణలు ఇచ్చి, ఉద్యమానికి తన వంతు సహకారం అందించారు. పర్యవేక్షణ సమాఖ్యను జాతీయ గ్రామీణ మిషన్‌తో అనుసంధానించే భాగస్వామ్య ఒప్పందం కోసం పై అధికారులతో కలిసి పనిచేసి సాధించారు.
- 2013 సంవత్సరం నుండి 2017 సంవత్సరం వరకు పర్యవేక్షణ సమాఖ్య ద్వారా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు, ప్రొఫెషనల్ రిసోర్స్ పర్సన్‌లను దాదాపు 200 మందిని సమాఖ్య ద్వారా ఎంపిక చేసి వారికి ప్రతి బ్యాచ్‌కు 100 రోజుల చొప్పున హిందీ, బెంగాలీ బాషలను నేర్పించి వారికి సంఘాల, సమాఖ్యల నిర్వహణపై శిక్షణ ఇచ్చి వారిని బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు పంపించి అక్కడి సభ్యులతో సంఘాలు, సమాఖ్యలు ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చి ఎప్పటికప్పుడు ఆ రాష్ట్రాలలో పర్యటించి సి.ఆర్.పి లకు సహకరిస్తూ అక్కడ రాష్ట్ర అధికారులతో సమన్వయంగా పనిచేసి ఆ రాష్ట్రాలలో పర్యవేక్షణ సమాఖ్య ప్రతిష్ఠను పెంచడానికి కృషి చేశారు.
- "స్వయం నియంత్రణ ఉద్యమం" కార్యక్రమాలు కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణకే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా విస్తరణలో భాగంగా బీహార్‌లోని బి.ఆర్.యల్.పి.యస్, ఉత్తరప్రదేశ్‌లోని రాజీవ్‌గాంధీ మహిళా వికాస్ పరియోజన, మహారాష్ట్రలోని చైతన్య సంస్థ, రాజస్థాన్ లోని ఇబ్త్రాధ సంస్థ, రాజీవిక సంస్థలతో స్వయం నియంత్రణ ఉద్యమ కార్యక్రమాల అమలు కోసం సంస్థలతో కలిసి పని చేశారు. ఎప్పటికప్పుడు ఆ రాష్ట్రాలలో పర్యటించి వారికి శిక్షణలు, క్షేత్ర సందర్శనలు ఏర్పాటు చేశారు. ఆ రాష్ట్రాలలో ఎంతోమంది నాయకురాళ్ళను తయారు చేశారు.


కామారెడ్డిలోని ధరణి ఎఫ్ పి ఓ బోర్డు సభ్యులకు శిక్షణ

**స్టార్ ట్రైనర్**

- 2010 నుండి 2020 వరకు (ఇప్పటివరకు) హైదరాబాద్‌లోని ఏపిమాస్ ట్రైనింగ్ సెంటర్‌లో దాదాపు 100 బ్యాచ్‌లకు పైగా శిక్షణలు, క్షేత్ర సందర్శనలు నిర్వహించారు. ఏపిమాస్ సంస్థలోనే అత్యధిక శిక్షణలు, క్షేత్ర సందర్శనలు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఏపిమాస్ సి.ఇ.ఓ గారి ద్వారా "స్టార్ ట్రైనర్" అంటూ ప్రశంసలు అందుకున్నారు.
- బీహార్ రాష్ట్రంలో ఏపిమాస్ – ఈ. అండ్ వై ప్రాజెక్ట్‌కు గడిచిన ఐదు సంవత్సరాలుగా నిర్వహణ విషయంలో టీం లీడర్‌గా వ్యవహరిస్తున్నారు. అక్కడి సంఘాలు, సమాఖ్యలు ఏర్పాటు చేయటంలో ప్రధాన పాత్ర పోషిస్తూ, అక్కడి బి.ఆర్.ఏ.పి.యస్ సంస్థతో చక్కని అనుసంధానం చేస్తూ, ఆర్థిక సహాయ సంస్థలు కూడా సంతృప్తి పొందేలాగా ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నారు.
- మహిళా సంఘాలతో, సమాఖ్యలతో పాటుగా ఇప్పుడు రైతు సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఏర్పాటు చేసే విషయంలో, వాటికి, వాటి సభ్యులకు, సిబ్బందికి రైతు ఉత్పత్తిదారుల సంస్థల నిర్వహణ కోసం శిక్షణలు ఇస్తున్నారు. ఏపిమాస్ రైతు ఉత్పత్తిదారుల సంస్థల బోర్డు సభ్యుల కోసం తయారుచేసిన సెల్ఫ్ లెర్నింగ్ మాడ్యూల్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా నాబార్డ్ వారితో ఒప్పందంలో భాగంగా అస్సాం రాష్ట్రంలో నాబార్డు ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంస్థల సిబ్బందికి ఐదు రోజులపాటుగా అస్సాంలో శిక్షణ యిచ్చారు.

➪ కామారెడ్డి జిల్లాలోని ధరణి ఎఫ్.పి.ఓ ని ఏర్పాటు చేసే దగ్గర నుండి ఒక ముఖ్య భూమిక పోషిస్తూ వస్తున్నారు.

➪ 2017 నుండి 2020 ఇప్పటివరకు ధరణి ఎఫ్.పి.ఓ అంచెలు అంచెలుగా ఎదగటానికి తనవంతు పాటుపడ్డారు. ఇందులో ముఖ్యంగా సంఘాల ఏర్పాటు, వారికి శిక్షణలు, సమావేశాల నిర్వహణ, ఎన్నికలు, పుస్తక నిర్వహణ, ఆడిట్, మహాసభ, రిటర్న్ ఫైలింగ్ ఉపకమిటిల ఏర్పాటు, వ్యాపార కార్యక్రమాలు, మక్కలు, వరి కొనుగోలు సెంటర్, రైతు సేవ కేంద్రం కస్టమ్ హైరింగ్ సెంటర్, నూతన సభ్యత్వం మొదలగు కార్యక్రమాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంస్థ అభివృద్ధికి దోహదపడుతున్నారు.

➪ వివిధ అంశాలపై శ్రీ శ్రీనివాస్ రాసిన వ్యాసాలు 'మహిళా సాధికారత ' పత్రికలో ప్రచురితం అయ్యాయి. మహిళా సాధికారత పత్రిక దశాబ్ది ఉత్సవం సందర్భంగా అప్పటి మంత్రి శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకున్నారు. వ్యాసాలు కొనసాగిస్తున్నారు.

➪ శ్రీ శ్రీనివాస్ 2016వ సంవత్సరంలో డి.జి.ఆర్.వి సహకారంతో ఏపిమాస్ బృందంతో కలిసి జర్మనీ దేశానికి వెళ్ళి అక్కడి సహకార విధానాన్ని, ఆడిట్, శిక్షణలు మొదలగు పద్ధతులను అవగాహన చేసుకుని, ఇక్కడ వాటి అమలు కోసం కృషి చేస్తున్నారు.



*అస్సాంలో నాబార్డ్ ఎఫ్ పి ఓ ల సిబ్బందికి శిక్షణ*

**సి ఎస్ రెడ్డిగారి తోడ్పాటుతోనే ...**

తాను ఇంతగా వివిధ శిక్షణలు పొందడానికి, అనేక రాష్ట్రాలలో శిక్షణలు యివ్వడానికి ఏపిమాస్ సి.ఇ.ఓ శ్రీ సి యస్. రెడ్డి గారి తోడ్పాటు, శ్రీమతి యస్.రామలక్ష్మి గారి ప్రోత్సాహమే కారణమని శ్రీ శ్రీనివాస్ తెలిపారు.

ఏపిమాస్ ప్రోత్సాహంతో, తోడ్పాటుతో ఎన్నో రకాల శిక్షణలు పొంది, అనేక శిక్షణలు ఇచ్చి, ఈ శిక్షణలతో వ్యక్తులలో, సంస్థలలో, క్షేత్ర స్థాయిలో చోటు చేసుకున్న మార్పులను, ఫలితాలను నేరుగా చూడటం ఆనందంగా వుందని శ్రీ శ్రీనివాస్ తెలిపారు.

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో తనతో పాటుగా పని చేస్తున్న తన టీం లోని సభ్యులు, ఏపిమాస్ లోని సహచర సిబ్బంది అందరూ తనకు ఎంతగానో సహకారం అందించడం వల్లనే ఇంత చక్కటి ఫలితాలను సాధించగలుగు తున్నామని ఆయన అన్నారు.

తాను అంచెలంచెలుగా ఎదగటానికి, తన అభివృద్ధికి ఏపిమాస్ సి.ఇ.ఓ శ్రీ సి యస్.రెడ్డి గారు అందిస్తున్న తోడ్పాటుకు, శ్రీమతి యస్.రామలక్ష్మి గారి నిరంతర ప్రోత్సాహానికి తాను ఎంతైనా కృతజ్ఞుడినని శ్రీ శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. ■



*బెనిన్ దేశ బృందానికి హైదరాబాదులో శిక్షణ*

**అవకాశాలు అరుదు... వాటిని గమనించి ఒడిసి పట్టుకోగలిగిన కార్యశీలురు మరీ అరుదు**

# గొర్రెలు, మేకలలో కాలి పుండ్ల వ్యాధి

ఈ వ్యాధిని ఒక్కొక్క ప్రాంతంలో గిట్టల పుండ్లు, బురద పుండ్లు, అడుగు తెగులు, పొగాళ్ళు అని కూడా వ్యవరిస్తుంటారు. ఫుట్ రాట్ ఫ్లూజో బాక్టీరియమ్ నెక్రోఫోరం, స్పోరోఫోరస్నో డోసిస్ బాక్టీరియా వలన వ్యాప్తి చెందే అంటువ్యాధి.

- ఈ వ్యాధి ఎక్కువగా వర్షాకాలంలో అన్ని వయస్సుల గొర్రెలకు మేకలకు సోకుతుంది.
- వర్షాకాలంలో బురద నేలల్లో తిరిగినప్పుడు, వరి కోతలయిన తరువాత పొలాల్లో సన్న జీవాలు మేపు కొరకు తిరిగి నప్పుడు ఈ వ్యాధి సోకుతుంది.
- ఫుట్ రాట్ వ్యాధి సోకిన జీవాలు ఉత్పాదక శక్తిని కోల్పోయి, ఒక్కోసారి మరణాలు సంభవిస్థాయి.
- చికిత్సకు లొంగక పోతే జీవాలను అమ్ముకోవాల్సి వస్తుంది
- రైతులు ఆర్థికంగా ఎక్కువ నష్టపోతారు.
- చిత్తడి నేలలలో జీవాలు తిరిగినప్పుడు ఈ బాక్టీరియా యితర బాక్టీరియాలతో కలసి ఫుట్ రాట్ ను తొందరగా వ్యాపింపచేస్తుంది.
- జబ్బు సోకిన జీవాల నుండి బాక్టీరియా ఎరువుల రూపంలో పాకలోని నేల మీదకు ప్రవేశించి, తర్వాత ఇతర ఆరోగ్యవంతమైన జీవాలకు వ్యాప్తి చెందుతుంది.

**లక్షణాలు**

- జీవాల గిట్టల మధ్యచర్మము తేమతో కూడి, మెత్తబడి, వాచి చిట్లిపోతాయి.
- ఒక్కోసారి గిట్టలు అడ్డదిడ్డంగా పెరిగి చర్మము నుండి వేరు పడతాయి. కొన్ని సమయాల్లో రాలిపోతాయి.
- ఒక కాలికి కానీ, అన్ని కాళ్ళకు కానీ ఈ వ్యాధి సోకుతుంది.
- కాళ్ళ గిట్టల మధ్య దుర్వాసనతో కూడిన పుండ్లు ఏర్పడతాయి.
- కాళ్ళ గిట్టల నొప్పులు ఎక్కువయ్యి కుంటుతూ నడుస్తాయి వంగి మోకాళ్ళ మీద కూర్చొని నడుస్తాయి.
- మంద నుండి వేరు పడి నడువలేక వెనుకబడి పోతాయి
- వ్యాధి సోకిన జీవాలను మందనుండి వేరు చేసి వైద్యము అందించి బాగు చేయాలి. చికిత్సకు లొంగనిచో వాటిని మందనుండి తొలగించాలి.



**చికిత్స**

ఎక్కువ ఖర్చుతో కూడిన చికిత్స కన్నా, తక్కువ ఖర్చుతో మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించిట్లయితే వ్యాధిని తొందరగా అరికట్టవచ్చును. మెరుగైన వైద్యము సకాలములో అందించి వ్యాధిని నయం చేయవచ్చును.

1. అస్తవ్యస్తంగా పెరిగిన గిట్టలను సక్రమముగా కత్తిరించి, పరి శుభ్రంగా ఉంచాలి
2. ఫుట్ బాత్ (మందులతో కూడిన నీరున్న చిన్న తొట్టె) ఉపయోగించి జబ్బును కొంతవరకు అరికట్టవచ్చును
3. 10% జింక్ సల్ఫేట్ లేదా, 8% పొటాసియం పర్మాంగనేట్ లేదా, 5% ఫార్మలీన్ కలిపిన నీళ్ళతొట్టెలో జీవాలను 5 నుండి 10 నిమిషాలు నిలపెట్టాలి
4. ఈ చికిత్స ఆరుబయట జీవాలను మేపు రైతులు చేయలేరు
5. సాంద్ర పద్దతిలో మేపుచున్న వారు చేయవచ్చును
6. యాంటి బయాటిక్స్ మందులు ఇవ్వాలి



7. పైపూతకు మందులు వాడాలి

చికిత్స చేసినా ప్రయోజనం లేని జీవాలను మందనుండి శాశ్వతంగా తొలగించాలి. పైన సూచించిన అయిదు సూత్రాలను పాటించి వ్యాధి అరికట్టవచ్చును.

- కాళ్లను 10% మైలుతుత్తం లేదా, 10% జింక్ సల్ఫేట్ లేదా 5% ఫార్మాలిన్ తో శుభ్రంచేసి లోరాక్సిన్, టాపికుర్, చార్మిల్ ప్లస్ వంటి మందులు పై పూతగా వాడాలి.
- ఐఎన్‌జె. సిఫ్టోఫర్ సోడియం, టజోబాక్ట్రమ్ మందులు కేజీ శరీర బరువుకు 1.10 ఎం.జి చొప్పున 7 నుండి 8 రోజులు పశువైద్యుల పర్య వేక్షణలో వాడాలి.
- నొప్పులు తగ్గటానికి మందులు వేయాలి.
- జీవాల పాకలోని మట్టిని 12 అంగుళాల వరకు తొలగించి, పొడి సున్నము పాక మొత్తము చల్లి, మరల కొత్త మట్టిని 6 అంగుళాల మేర వేయాలి. ఇలా చేయడంవలన పాకలో నేల మీద వున్న బ్యాక్టీరియాను తొలగించవచ్చును
- రాత్రి వేళలో పొలాల్లో మంద పెట్టు జీవాలను ప్రతిరోజూ కొత్తచోట మందపెట్టాలి.
- జీవాలు నీరసపడకుండా జావ, ఉప్పు బెల్లముతో కలిపి త్రాగించాలి.
- లేత గడ్డిని, తేలికగా జీర్ణమయ్యే దాణాను అందివ్వాలి.
- పశువులను బురద, చిత్తడి నేలలలో తిరుగ నియ్యరాదు.

■

## భర్తతో విడిపోయిన మహిళలకు ఊరట

**భ**ర్త నుంచి విడిపోయిన మహిళలకు సంబంధించిన హక్కుల గురించి సుప్రీంకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. తన జీవిత భాగస్వామితో కలిసి జీవించకుండా దూరంగా ఉంటున్న మహిళకు అత్తవారింట్లో నివసించే హక్కు ఉందని తాజాగా సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 2019లో దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సతీష్‌చందర్ ఆహుజా అనే వ్యక్తి దాఖలు చేసిన అప్పీలును న్యాయమూర్తులు అశోక్‌భూషణ్, ఆర్. సుభాష్‌రెడ్డి, ఎం.ఆర్. షాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టి వేసింది. రవీన్ అహుజా అనే వ్యక్తి, ఆయన భార్య స్నేహ విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో స్నేహ అహుజా కూడా తన అత్తవారింట్లోనే ఉంటోంది. కాగా విడాకులకు దరఖాస్తు చేసిన తమ కోడలు ఇంట్లో ఉండ రాదంటూ రవీన్ తండ్రి సతీష్ అహుజా న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసులో దిల్లీ హైకోర్టు సదరు యువతి అత్తారింట్లో ఉండేందుకు అనుమతినిస్తూ తీర్పు వెలువరించింది. కాగా ఈ తీర్పును సతీష్‌చందర్ సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఆ ఇల్లు తన స్వార్జితమని ఇందులో తన కుమారుడికే హక్కు లేనప్పుడు కోడలికి ఉండే హక్కు ఏవిధంగా లభిస్తుందని ఆయన ప్రశ్నించారు.

**పలు పాత్రలు పోషిస్తున్నా వివక్షే....**

కాగా ఈ వాదనను సుప్రీం ధర్మాసనం కొట్టివేసింది. స్నేహ, రవీన్‌ల విడాకుల ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ఆమెకు తన అత్తవారింట్లో ఉండే హక్కు ఉందని కోర్టు స్పష్టం చేసింది. దేశంలో గృహహింస ప్రబలంగా ఉందని, రోజూ మహిళలు ఏదో ఒకరూపంలో హింసను ఎదు ర్కొంటున్నారని న్యాయస్థానం పేర్కొంది. జీవితకాలమంతా కుమార్తె, సోదరి, భార్య, తల్లి, భాగస్వామి ఇలా పలురకాల పాత్రలను పోషించే మహిళలు వివక్ష ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా సుప్రీం అభిప్రాయపడింది. గృహహింస చట్టం ప్రకారం మహిళలు భర్తతో కలిసి ఉండనప్పటికీ అత్తవారింట్లో నివసించే హక్కు ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం వివరించింది.

■

# పాలమూరు జిల్లాలో కోటి విత్తన బంతుల సంరంభం

**(17వ పేజీ తరువాయి)**

2020 ఆగస్ట్ 19 నాడు మంత్రి శ్రీ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కలెక్టర్ శ్రీ ఎస్. వెంకట్‌రావు, జిల్లా ఇతర ఉన్నతాధికారులు, జిల్లా మహిళా సమాఖ్య, మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యలు, స్వయం సహాయక సంఘ సభ్యులు, ఐకేపి సిబ్బంది పాల్గొని ఎర్రమన్ను గుట్ట, వీరన్న పేట, మహబూబ్‌నగర్ లలో డ్రోన్‌ల ద్వారా విత్తన బంతులను వెదజల్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ నియోజక వర్గాల వారీగా, జడ్చర్ల నియోజక వర్గంలో ఎమ్మెల్యే శ్రీ లక్ష్మారెడ్డి, దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీ అల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమాలలో విత్తన బంతులను వెదజల్లారు. ఇదేవిధంగా జిల్లాలోని అన్ని గ్రామాలలోని స్వయం సహాయక సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అందరూ వారి గ్రామాలలో ఉన్న అటవీ భూములలో, గుట్టల పైన ఖాళీ ప్రదేశాలలో 1 కోటి 14 లక్షల విత్తన బంతులను విజయవంతంగా వెదజల్లారు.



వెదజల్లిన విత్తన బంతుల నుండి 58% మొలకెత్తినట్టు గమనించారు. మొక్కల సంరక్షణ నిమిత్తం "బ్రష్ ఉడ్ ఫెన్సింగ్"లు కూడా ఏర్పాటు చేశారు.

**కె టి ఆర్ ప్రశంస**

పచ్చదనాన్ని పెంచడం లక్ష్యంగా పాలమూరు స్వయం సహాయక సంఘ సభ్యులు చేపట్టిన కోటి విత్తన బంతుల కార్యక్రమం చాలా ఆదర్శప్రాయంగా వున్నదని మంత్రి శ్రీ కె. తారక రామారావుగారు ట్విట్టర్‌లో ప్రశంసించారు. మహిళా స్వయం సహాయక సంఘ సభ్యుల ఈ కోటి విత్తన బంతుల సామాజిక సేవా కార్యక్రమాన్ని ఎరిక్ సోల్హెన్ (యు.ఎన్.ఓ) ట్విట్టర్‌లో ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ ఎస్. వెంకట్‌రావు, డి.ఆర్.డి.ఓ శ్రీ. ఎస్. వెంకట్‌రెడ్డి, అదనపు డి.ఆర్.డి.ఓ శ్రీమతి ఎస్.శారద, పాలమూరు జిల్లా అధ్యక్షులు శ్రీమతి యం.సురేఖ, కార్యదర్శి బి.వరలక్ష్మి గారు, కోశాధికారి శ్రీమతి యం. అరుణ, సిబ్బంది శ్రీమతి ఎ. నాగమల్లిక, డిపియం(ఐబి), శ్రీ కె. అనిల్ కుమార్, డిపియం (ఫామ్), శ్రీ ఎ.చెన్నయ్య, డిపియం (నాన్ ఫామ్), దామోదర్, డిపియం (ఫైనాన్స్), శ్రీ ఎ.కృష్ణయ్య, డిపియం (ఎస్.ఎస్), శ్రీమతి సలోమి డిపియం (బ్యాంక్ లింకేజ్), శ్రీ.సుదర్శన్-ఎపియం, హన్వాడ, శ్రీ రాంబాబు-ఎపియం, నవాబ్ పేట, శ్రీ సుధీర్-ఎపియం, అడ్డాకల్, శ్రీ నాగరాజు-ఎపియం, బాలానగర్, శ్రీ వెంకటాచారి-ఎపియం, రాజాపూర్, శ్రీ విష్ణాచారి-ఎపియం, మూసాపేట, శ్రీ మాల్యానాయక్-ఎపియం, జడ్చర్ల, శ్రీమతి మాధవి-ఎపియం, మహబూబ్‌నగర్, శ్రీమతి హైమావతి-ఎపియం, భూత్పూర్, శ్రీమతి విజయ-ఎపియం, సిసి కుంట, శ్రీమతి సునీత-ఎపియం, కోయిల్ కొండ, నిర్మల గారు- ఎపియం, దేవరకద్ర, శ్రీ బాలకృష్ణ, ఎపియం, గండీడ్, శ్రీ రామదాస్,ఎపియం, మిడ్జిల్, శ్రీ యం.వెంకటేశ్వర్లు ఎపియం(హెచ్.ఆర్), శ్రీ రవికుమార్, ఎపియం (ఫామ్), శ్రీ రమేశ్, ఎపియం(నాన్ ఫామ్)లు అడ్మిన్ అసిస్టెంట్‌లు శ్రీ ఖాజా మొయినొద్దీన్, అడ్మిన్ అసిస్టెంట్, శ్రీ సునిల్, శ్రీమతి మంజుల, శ్రీమతి షభానా, శ్రీమతి అరుంధతి, అటెండర్ శ్రీమతి సరస్వతి మొదలగు వారు ఈ కార్యక్రమంలో పాలొన్నారు. ■

# 'ధరణి' ఎఫ్ పి ఓ పాలకవర్గ సభ్యులకు శిక్షణ

**- జి. శ్రీనివాస్**

**కా**మారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ మండలంలో ధరణి రైతు ఉత్పత్తిదారుల ఏర్పాటు చేసి నాలుగు సంవత్సరాలు అవుతున్నది. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా సంస్థ చట్టపరమైన కార్యక్రమాలైన ఆడిట్ , వార్షిక మహాసభ నిర్వహణ కార్యక్రమాలను నిర్ణీత సమయంలోగా నిర్వహించి జిల్లా సహకార అధికారికి రిటర్న్ దాఖలు చేశారు. మహాసభలో పాలకవర్గ సభ్యుల, పదాధికారుల



ఎన్నిక నిర్వహించారు. కొత్తగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు, పాతవారికి, వారి సిబ్బందికి, సలహా సభ్యులకు 2020 అక్టోబర్ 7, 8 తేదీలలో రెండు రోజుల పాటు సదాశివనగర్ మండలంలో డి.జి.ఆర్.వి వారి సహకారంతో ఏపిమాస్ ఆధ్వర్యంలో శిక్షణను నిర్వహించారు.

**శిక్షణ ఉద్దేశం:**

- ➪ పాలకవర్గ సభ్యులకు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆవశ్యకత, నిర్వహణ గురించి అవగాహన కలిగించడం
- ➪ పాలకవర్గ సభ్యులకు వారి విధులు - బాధ్యతలపై అవగాహన కలిగించడం
- ➪ రైతు ఉత్పత్తిదారుల సంస్థలో ఇన్పుట్, అవుట్ పుట్ వ్యాపార, మార్కెటింగ్‌పై అవగాహన కలిగించడం

రెండు రోజుల పాటుగా జరిగిన శిక్షణలో పాలకవర్గ సభ్యులకు ఈ క్రింది విషయాలపై అవగాహన కల్పించారు.

- ➪ ధరణి రైతు ఉత్పత్తిదారుల సంస్థ తీరుతెన్నులు, కార్యక్రమాలు
- ➪ ఏపిమాస్ సహకారం, నిర్వహించే కార్యక్రమాలు
- ➪ రైతు ఉత్పత్తిదారులసంస్థ ఆవశ్యకత,సహకార సూత్రాలు
- ➪ సమావేశాల రకాలు, నిర్వహణ పద్ధతులు
- ➪ మహాసభ, పాలకవర్గ సభ్యుల, పదాధికారుల, సిబ్బంది విధులు బాధ్యతలు
- ➪ ఇన్పుట్, అవుట్ పుట్ వ్యాపార, మార్కెటింగ్
- ➪ వాష్ కార్యక్రమంపై అవగాహన

పైన తెలిపిన విషయాలను రోల్-ప్లే, కథలు, చిన్న గ్రూప్ చర్చలు, ఆటలు-పాటలు ఎక్సర్‌సైజ్ మొదలగు పద్ధతులను ఉపయోగిస్తూ సహభాగ పద్ధతిలో వివరించి చెప్పటం జరిగింది.

ఏపిమాస్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుండి జి. శ్రీనివాస్‌గారు, మధుమంజరి గారు, భవాని గారు, విజయ గారు, ఏపిమాస్ కామారెడ్డి సిబ్బంది అమృతరాణిగారు, తిరుపతిరెడ్డి గారు పాల్గొని ఆయా అంశాలను వివరించారు.

శిక్షణలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు, సిబ్బంది మాట్లాడుతూ నూతనంగా ఎంపిక కాబడిన తమకు తమ విధులు, బాధ్యలు, నిర్వహణ, ఇన్‌పుట్, అవుట్‌పుట్ వ్యాపార, మార్కెటింగ్ మొదలగు అంశాలపై ఎంతగానో అవగాహన కలిగిందని, ఈ అవగాహనతో రాబోవు రోజులలో ధరణి రైతు ఉత్పత్తిదారుల సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని, ఇంత చక్కని శిక్షణ ఏర్పాటు కు సహకరించిన డి.జి.ఆర్.వి వారికి శిక్షణ ఇచ్చిన ఏపిమాస్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శిక్షణలో చివరగా పాలకవర్గ సభ్యులతో చక్కని కార్యాచరణ ప్రణాళికను తయారు చేయించి శిక్షణను ముగించటం జరిగింది. ■

మౌనం అర్థంకాకపోతే, భాషకూడా అర్థంకాదు

# సమీకృత వ్యవసాయ ఫలాలు

–జి.ఆర్.అమరేంద్ర

**సు**ధాకర్ (నెలితిప్ప) నాలుగు సంవత్సరాల ముందు కోట మండలంలో చిన్నకారు రైతు. నాలుగు సంవత్సరాల ముందు సమీకృత వ్యవసాయం పెంపుదల కోసం జి 4 ప్రాజెక్టులో ప్రదర్శన రైతుగా ఎంపికయ్యారు. సమీకృత వ్యవసాయ పద్ధతులను ఆచరించడంకోసం రైతు భాగస్వామ్య విధానంలో చిన్న జీవాలు, కోళ్ళు, బహువార్షిక పశు గ్రాసం – సూపర్ నేపియర్, గట్లపై మొక్కలను ఏపిమాస్ ఆయనకు అందజేసింది.

**గత సంవత్సరంగా గొర్రె ద్వారా ఆదాయం:**


| సంవత్సరం | కొనుగోలు చేసినది | కొనుగోలు విలువ (రూ) | సంరక్షించిన నెలలు | అమ్మకం ద్వారా వచ్చిన డబ్బు (రూ) | లాభం (రూ) |
|---|---|---|---|---|---|
| డిసెంబర్ 2019 | ఒక పొట్టేలు పిల్ల | 10,000 | 2 నెలలు | 12,000 | 2000 |
| మార్చి 2020 | ఒక గొర్రె , ఒక పొట్టేలు పిల్ల | 12,000 | 3 నెలలు | 16,000 | 4000 |
| జూన్ 2020 | 2 పొట్టేలు పిల్లలు | 14000+ దాణా 2000/- | 5 నెలలు | 30,000 | 14,000 |
| 9 నెలలలో ఆదాయం | | | | | 20,000 |

జి4 ప్రాజెక్టు సహకారంతో సమీకృత వ్యవసాయ విధానాల పెంపుదలలో భాగంగా కొంతమంది రైతులు నాటు కోళ్ళు పెంపకం చేస్తున్నాడు. 2020 సంవత్సరంలో 6 పందెం కోడి పిల్లలను ఒక్కొక్కటి 2000/–రూపాయలకు కొని గత సెప్టెంబర్ 2020 నెలలో ఒక్కొక్కటి 6000/– రూపాయలకు అమ్మడం జరిగింది. ఈ 6 పందెం కోళ్ల ద్వారా ఆదాయం 24000 రూపాయలు. ఇంకా ఇతనివద్ద నాటు పెట్ట పిల్లలు 12 వున్నాయి వీటిని దసరా పండుగకు మంచి రేటు ఉంటుంది అమ్ముతామని చెప్పడం జరిగింది. స్థానికంగా ఒక్కొ కిలో రూ.లు 400 రూపాయల రేటు వున్నది. ఒక్కో కోడి 2.750 కిలోలు వస్తున్నది కాబట్టి సరాసరి1,000 రూపాయలకు అమ్ముడవుతుంది. కాబట్టి 12 కోళ్లకు రూ.లు 12, 000/– వస్తుంది అని సుధాకర్ చెప్పాడు.

ఈ లెక్కన ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 32,000 రూపాయల ఆదాయం వస్తుంది. ఆవు పాలను రోజుకు సరాసరి 9 లీటర్లు చొప్పున అమ్ముతున్నాడు. ఈ విధంగా రోజుకు లీటరు పాలకు 22/– రూపాయల చొప్పున నెలకు







# హింస భరించవద్దు ... మాకు చెప్పండి !

**క**ట్టుకున్నవాడు, కన్నతండ్రి మాత్రమే కాదు ఆఖరికి పేగు తెంచుకుని పుట్టిన కొడుకుల చేతిలో కూడా హింసకు గురవుతున్న మహిళలు ఎందరో! అలాంటి వాళ్ళందరికీ చేయూతనిస్తోంది హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 'మై ఛాయిసెస్ ఫౌండేషన్'. పేదరికం, నిరక్షరాస్యత, పురుషాధిక్య భావజాలం... వంటివెన్నో మహిళలపై దురాగతాలకు కారణాలు అంటారు ఆ సంస్థ వ్యవస్థాపకురాలు ఎల్కా గాబ్రెల్. ఆర్థికశాస్త్రం చదువుకున్న ఎల్కా జర్మనీ దేశస్థురాలు. ఆమె మొదట 'ఇంటర్నేషనల్ ఆస్ట్రేలియా' అనే స్వచ్ఛంద సంస్థలో ఉన్నతోద్యోగం చేసేవారు. పేదరిక నిర్మూలనకు క్షేత్రస్థాయి పరిష్కారాల్ని చూపే సంస్థ అది. 'నా విధుల్లో భాగంగా ఇండియా వచ్చి ఆరునెలల పాటు వివిధ నగరాల్లో ఉన్న మురికివాడలన్నీ తిరిగా. స్థానిక ఎన్జీవోలూ, మహిళా స్వయ సహాయక బృందాలను కలిశా. అప్పుడు మహిళల నుంచి పదే పదే వినిపించిన మాట...'గృహహింస'. వాళ్ళ మాటల్లోని ఆవేదన నామీద చాలా ప్రభావం చూపింది. బాగా ఆలోచించాక ఆర్థిక సాధికారతతో పాటు మహిళలకు శారీరక, మానసిక రక్షణ అవసరం చాలా ఉందని అర్థమయింది. దాంతో సిడ్నీ నుంచి హైదరాబాద్ వచ్చి ఇక్కడే కుటుంబంతో సహా స్థిరపడ్డా. కానీ ఇక్కడ మార్పు తేవడం అంత సులువు కాదని చాలామంది అన్నారు. ప్రయత్నిస్తే కదా... ఫలితం తెలిసేది' అంటారు ఎల్కా.

రాణి (అసలు పేరు కాదు) విషయంలో కన్నతండ్రే పశువులా ప్రవర్తించాడు. కామంతో కళ్ళు మూసుకుపోయి వేధింపులకు గురి చేశాడు. శారీరకంగా చిత్రహింసలు పెట్టాడు. బతుకుమీద ఆశ వదిలేసుకున్న రాణిని 'మై ఛాయిసెస్' ఇచ్చిన భరోసా... తిరిగి జీవితంలో నిలదొక్కుకునేలా చేసింది.

పదహారేళ్ళకే ఆశకు (అసలు పేరు కాదు) పెళ్ళి చేసి గుండెల మీద భారం దించుకున్నారు ఆమె తల్లిదండ్రులు. వ్యసనాలకు బానిసైన భర్త ఆమెను వ్యభిచారంలోకి దింపాలనుకున్నాడు. ఇక చావే శరణ్యం అనుకున్న సమయంలో ఆమెను కాపాడి తన కాళ్లమీద తాను నిలబడేలా చేసింది మై ఛాయిసెస్.

ఇరవై ఏళ్ళకే వితంతువైన గరిమా (అసలు పేరు కాదు) ఇద్దరు పిల్లలతో పూట గడవక సతమతమయ్యేది. అలాంటి సమయంలో ఆమెకు ఉపాధి ఆశ చూపించి అక్రమ రవాణా చేయాలనుకుందో ముఠా. ఆ రాక్షసుల చెర నుంచి ఆమెను కాపాడి ఆ చిన్నారుల బాధ్యత తీసుకుంది మై ఛాయిసెస్.

**స్థానికులే కార్యకర్తలు...**

హైదరాబాద్ కేంద్రంగా 2012లో ఈ ఫౌండేషన్ సేవల్ని ప్రారంభించింది. జంట నగరాల్లోని ఫలక్‌నుమా, రెడ్‌హిల్స్, షాహీనగర్, బజార్ ఘాట్, యాకూత్‌పురా... ఇలా 122 ప్రాంతాల్లో స్త్రీలపై హింస ఎక్కువగా ఉందని తెలుసుకుందీ సంస్థ. ఆయా ప్రాంతాల్లోని బాధితులని గుర్తించి, బయటకు తీసుకురావడానికి చురుగ్గా ఉండే స్థానికుల్నే కార్యకర్తలుగా మార్చుకుంది. వీళ్ళు బస్తీల్లో సాధారణ పౌరుల్లానే తిరుగుతూ హింసకు గురవుతున్న స్త్రీలను గుర్తించి నిపుణుల చేత

---

5940/- రూపాయలు సంపాదిస్తున్నానని సుధాకర్ చెప్పాడు. సమీకృత వ్యవసాయంలో భాగంగా వరి పొలంలో, మామిడి తోటలో బహువార్షిక నేపియర్ గడ్డి, స్టైలో వేయడం, వాటర్ షెడ్ ద్వారా నీటి కుంటలు, చెక్ డ్యాంలు, కందకాలు ఏర్పాటు చేసుకున్నానని సుధాకర్ తెలియజేశాడు. జి4 ప్రాజెక్ట్‌లో భాగంగా ఏపిమాస్ ఇచ్చిన శిక్షణలు, సందర్శనలు తనకు బాగా ఉపయోగపడ్డాయని, తానే కాకుండా చాలా మంది రైతులు సమీకృత వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు

ఓ. వేణప్ప - సుద్దులకుప్పం గ్రామంలో నివసిస్తున్న ఎస్‌సి చిన్నకారు రైతు. ఇతను తిరుమల రైతు సంఘంలో వున్నాడు, ముదరందొడ్డి గ్రామ సమాఖ్యలో సభ్యత్వం తీసికొని సమీకృత వ్యవసాయ విధానాలపై మంచి అవగాహన పెంచుకొని పాటిస్తున్నాడు. వి.కోట మండల సమాఖ్య నిర్వహించే కూరగాయల సమిష్టి వ్యాపార భాగస్వామిగా వివిధ రకాల కూరగాయలు పంపుతున్నాడు. ■

కౌన్సెలింగ్ ఇప్పిస్తూ ధైర్యం చెబుతారు. అవసరమైతే ఆశ్రయం కల్పించి, న్యాయ పోరాటంలో సాయమూ చేస్తారు. ఇలా ఈ సంస్థలో ఎనభైమందికి పైగా కార్యకర్తలు పని చేస్తున్నారు. వీరినే 'పీస్ మేకర్'లుగా పిలుస్తారు. వీరందరికీ బాధితులని గుర్తించే విషయంలో తగిన శిక్షణ ఉంటుంది. ఇప్పటివరకూ ఈ సంస్థ సుమారు 9000 గృహహింస కేసుల్ని పరిష్కరించింది. ఈ క్రమంలో సమస్యల పరిష్కారానికి చర్చలతో పాటు అవసరమైన చోట పోలీసుల సాయాన్నీ, న్యాయవాదుల సహకారాన్నీ తీసుకుంటోంది.

**అక్రమ రవాణాకు... అడ్డుకట్ట**

ఈ సంస్థ గత మూడేళ్ళుగా మహిళల, బాలికల అక్రమ రవాణాను కట్టుదిట్టంగా అడ్డుకుంటోంది. ఇందుకోసం 'ఆపరేషన్ రెడ్ అలర్ట్' పేరుతో జాతీయస్థాయిలో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, బీహార్ లలో స్థానిక స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకుని కాలేజీల్లో, గ్రామాల్లో మహిళలకు, బాలికలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇప్పటివరకూ వివిధ హింసల నుంచి బయటపడిన సుమారు వెయ్యిమంది మహిళలకు ఉపాధి కల్పించిందీ సంస్థ. ఇందుకోసం 'లోటస్ సేఫ్ హోమ్' పేరుతో పునరావాస కేంద్రాన్ని 2018 నుంచి నిర్వహిస్తు న్నారు. తాత్కాలిక పునరావాసం, కౌన్సెలింగ్,న్యాయసాయం, వృత్తివిద్యల్లో శిక్షణ... వంటివెన్నో ఇక్కడ అందుబాటులో ఉంటాయి. 'నిజానికి ఇలాంటి సంస్థను నిర్వహించడం అంత సులువేం కాదు. కౌన్సెలింగ్ సెంటర్‌కి వచ్చి ఈ కార్యక్రమాలు ఆపమంటూ చాలామంది గొడవలు చేస్తుం టారు. మా సంస్థ కార్యకర్తలపైనా దాడులకు దిగుతుంటారు. మార్పు కోసం, మహిళల పురోగతికోసం ఎన్ని ఇబ్బందుల నైనా ఎదుర్కోవడానికి మేం సిద్ధం" అంటారు ఎల్కా.

**లాక్‌డౌన్‌తో పెరిగిన కేసులు...**

కొవిడ్-19 పరిస్థితులూ మహిళలపై హింస పెరిగేలా చేశాయంటున్నాయి నివేదికలు. ఇరుకైన ఇళ్ళు, పెద్ద కుటుంబాలు, చాలీచాలని సంపాదన... వీటితోపాటు వేళ్లూనుకుపోయిన పురుషాధిక్య భావజాలం దీనికి ప్రధాన కారణాలు. మహిళలతో పాటు ఆడపిల్లలూ ఈ సమయంలో బాధితులైనారని చెప్పడానికి హెల్ప్‌లైన్ నంబర్లని ఆశ్రయిస్తున్న వారి సంఖ్య బాగా పెరుగుతుండడమే నిదర్శనం. ఆడపిల్లలకు ఆంక్షలు పెట్టడం, పద్ధతులు నేర్పడం మాత్రమే కాదు, మగపిల్లలకూ మంచీచెడు చెప్పాలి. మహిళలతో గౌరవంగా నడుచుకోవడం అలవాటు చేయాలి. అప్పుడే ఇవి ఆగుతాయి అన్నారు ఎల్కా గాబ్రెల్. (ఈనాడు సౌజన్యంతో)

■

**టోల్ ఫ్రీ నంబర్లు**
**గృహహింస బాధితుల కోసం**
**18002129131**
**అక్రమ రవాణా నివారణ కోసం**
**18004198588**

## ఏపిమాస్ చర్చావేదికలు

**(9వ పేజీతరువాయి)**

అక్టోబర్ 12 వ తేదీన జరిగింది.ఏపిమాస్ కన్సల్టెంట్ శ్రీమతి కళామణి ఈ చర్చను నిర్వహించారు.

(1) ఇప్పటివరకు అమలులోవున్న ఎఫ్ సి ఆర్ ఏ లో వున్నదేమిటి? ఈ కొత్త సవరణ తెచ్చే మార్పులేమిటి?
(2) సంబంధిత సంస్థలపైన, ముఖ్యంగా ఏపిమాస్ పైన ఈ సవరణల ప్రభావం ఏమిటి?
(3) దీనిపై ఏపిమాస్ ఎలా స్పందించాలి ? అనే మూడు ప్రధాన అంశాలపై ఈ చర్చ జరిగింది.

ఈ చర్చలకు వచ్చిన మంచి స్పందన దృష్ట్యా , ఇలాంటి చర్చల ఆవశ్యకత దృష్ట్యా మరిన్ని సంబంధిత అంశాలపై చర్చలు నిర్వహించాలన్న అభిప్రాయం వుంది. కొత్త ఎఫ్ పి ఓ లపై మార్గదర్శకాలు, కంపెనీల సవరణ చట్టం వంటి అంశాలపై చర్చలు నిర్వహించవచ్చు. ఈ విషయంలో సలహాలను, సూచనలను ఆహ్వానిస్తున్నాం.

■

# సాగుకు భరోసా లేకుంటే గ్రామాలకు భవిష్యత్తే లేదు

**– సుబ్రమణ్యరెడ్డి, యం.బి.**

*నేను పుట్టింది పల్లెటూరు, పెరిగింది పల్లెటూరు, చదివింది చాలావరకు పల్లె వాతావరణమే, పెళ్ళి చేసుకుంది పల్లెటూరే, 60 సంవత్సరాల వయసు తర్వాత ప్రస్తుత నివాసం తిరిగి పల్లెటూరే! ఈ మధ్యలో బ్రతకడానికి కొన్ని వత్సరాలు పల్లెనొదిలి, పట్నం బాటపట్టినా, చేసే ఉద్యోగ బాధ్యత కారణంగా పల్లె, పట్నం అభివృద్ధిలో భాగంగా తిరగటంలోనే గడిచిపోయింది. ఏదేమైనా, ఎందుకో మొదటినుంచి నాకు పల్లె అంటేనే ఇష్టం, పల్లె అంటేనే ఆనందం, పల్లె అంటేనే ఆహ్లాదం. అభివృద్ధిలో పట్టణానికి, పల్లెకు దూరం అంతకంతకూ పెరిగిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పల్లె అందం, ఆనందం మా 'నవ' సంబంధాలు మృగ్యమైపోతుంటే మనసు కకావికలమై ... నా అనుభవం, నాకు తోచింది, తెలిసింది, 'మహిళా సాధికారత'తో పంచుకుందామనే తపనతో వ్రాస్తున్నా ... ఈ చిన్న వాస్తవం!*

---

'అభివృద్ధి' అంటే ఏమిటి ? సిమెంట్ రోడ్లు, కొత్త కొత్త ఇళ్ళు, చదువుకోవడం, ఆ తర్వాత చదువు'కొన్న' లేదా చదువుకున్న యువత ఉద్యోగాల వేట పేరుతో దూర ప్రాంతాలకు వలసలు, ఆర్థిక వెసులుబాటు, ఎక్కడికి వెళ్ళాలన్నా చివరికి అరకిలోమీటరు దూరంలో ఉన్న చోటికి వెళ్ళాలన్నా నడక మరిచి యంత్రాలపై (బైక్ / ఆటో) మాత్రమే ప్రయాణం చేస్తున్న ప్రజలు, సబ్సిడీలు ఎక్కడ దొరుకుతాయో అంటూ ప్రభుత్వాఫీసులు, బ్యాంకుల చుట్టూ దళారీలతో చేతులు కలిపి తిరుగుళ్ళు!

పల్లెల్లో ప్రస్తుతం రైతు భూమి దున్నాలన్నా, భూమిలో పైరు వేయాలన్నా, వేసిన పైరుకు సరైన దిగుబడి లేదా ధర వస్తుందన్న ఆశ సన్నగిల్లి, ఎద్దులనేవి చూస్తామంటే మచ్చుకు ఒక్కటి కూడా కన్పించదు. కానీ ఇసుక లాబీతో వందల సంఖ్యలో ఎద్దుల బండ్లు పట్టణాల్లో పరుగులు తీస్తున్నాయి.

ప్రతి పట్టణానికి దాదాపు 20కిమీ వరకు రోడ్డులకు అటుఇటు భూములు 'రియల్ బూమ్'తో గత సంవత్సరం ఎకరా లక్ష రూపాయలున్న వ్యవసాయ భూమి నేడు పండినా, పండక పోయినా ఎకరా ఏభై లక్షల వరకు యెగిరిపోతోంది! అలా వున్న భూమిని అమ్ముకుని ఆయాచితంగా వచ్చిన డబ్బుతో, ఇంటిపట్టున వున్న యువత పనిలేక పిచ్చాపాటిగా పల్లె, పట్టణాల మధ్య 'తిరుగుళ్ళు'. బ్రతకడానికి ఇంటికి రెండో, మూడో పాడి ఎనుములు పెట్టుకుని, పాలను అమ్ముకుని జీవనం సాగిస్తున్న మహిళామణులు.

**దారిద్ర్య రేఖ (బిలో పావర్టీ లైన్)**

ప్రస్తుత ప్రభుత్వాల పనితీరుతో, సరికొత్త పథకాలతో ఆ గీత చెదిరి (చెడి) పోయింది. నూటికి 99.9% కుటుంబాలు కనీసం ఏదో ఒక పథకం కింద లబ్ధి పొందు తున్నాయి. పేదల పథకం, వికలాంగుల పథకం, ఒంటరి స్త్రీల పథకం, ఉపాధి హామీ పథకం ... ఇలా పేరు ఏదైనా, ఏ పథకమైనా పూర్తిగా గ్రామీణ ఉపాధి శక్తిని హరించి వేసేవే ! సాధారణంగా ఏ గ్రామంలోనైనా నిత్యం పనికెళితేనే కాని జరుగుబాటు వుండని కుటుంబాలు కేవలం నూటికి 20–25 మాత్రమే వుంటాయి. కాని వాస్తవ పరిస్థితి యిలా వుంటే, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 100 కి 90 కుటుంబాలు పనులకు వెడుతున్నాయంటే ఏమను కోవాలి? ఇక వ్యవసాయ పనులకు వచ్చేవారు ఎవరో, వ్యవసాయ పనులపై ఆధారం ఎలా వుందో గ్రామాల్లో విచారిస్తే వాస్తవాలు తెలుస్తాయి. ఇక నెలవారీ పెన్షన్ పొందే కుటుబాలు 99.9% !

**మగపిల్లల భవిష్యత్తు ?**

రియల్ బూమ్‌తో భూమి విలువ ఆకాశన్నంటినా, ఆస్తి విలువ కోట్లకు చేరుకున్నా వ్యవసాయంచేసే యువత

# మదనపల్లె నుంచి 'కిసాన్ రైలు' ?




టమోట ఉత్పత్తులకు దేశంలోనే పేరు పొందిన మదనపల్లె మార్కెట్ నుంచి పంట ఉత్పత్తులు తరలించేందుకు కిసాన్ రైలును నడపడంలోని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని రైల్వే డివిజనల్ గూడ్స్ ఆపరేటివ్ మేనేజర్ శ్రీ అనీష్‌యాదవ్ తెలిపారు. ఆయన ఇటీవల మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన రైల్వే అధికారులు, టమాట రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో రైతులు పండిస్తున్న వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను రైల్వే ద్వారా తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం 'కిసాన్ రైలు'ను ప్రవేశపెట్టిందన్నారు. దేశంలో మొదటి రైలు బీహార్ నుంచి నాగపూర్‌కు, రెండో రైలును సెప్టెంబర్ 10న అనంతపురం నుంచి ఢిల్లీకి పంపడం జరిగిందన్నారు. మదనపల్లె నుంచి దేశంలోని అనేక రాష్ట్రాలకు టమాట ఎగుమతి అవుతున్న విషయాన్ని గుర్తించి 'కిసాన్ రైలు' నడిపేందుకు అవకాశాలను పరిశీలించేందుకు వచ్చామన్నారు. రైతులకు మార్కెటింగ్ కష్టాలు తీర్చి, వారికి ఆదాయం కల్పించడమే 'కిసాన్ రైలు' ముఖ్య ఉద్దేశమన్నారు.

ప్రస్తుతం మదనపల్లె నుంచి ఢిల్లీ, కలకత్తా, విశాఖపట్నం, ముంబై తదితర ప్రాంతాలకు టమాట రవాణాకు సంబంధించి 'కిసాన్ రైలు' నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జిల్లా నుంచి పండ్లు, పండ్ల గుజ్జు, ఇతర ఉత్పత్తులు తరలించేందుకు రైతుల అవసరాలకు అనుగుణంగా 'కిసాన్ రైలు'ను నడుపుతామన్నారు. త్వరలో ధర్మవరం, కదిరి నుంచి 'కిసాన్ రైలు' సేవలు ప్రారంభిస్తున్నామని, వీటిని మదనపల్లెకు విస్తరించే క్రమంలో పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. వ్యాపారులతో రైల్వేశాఖ చర్చలు జరిపి రవాణా ఛార్జీలు నిర్ణయిస్తున్నామని తెలిపారు.

సమావేశంలో గుత్తి గూడ్స్ ఏడీఎంఈ శ్రీ అభినవ్ శ్రీవాత్సవ్, ఏసీఎం శ్రీ శ్రీనివాసులు, మదనపల్లె సీసీఇ శ్రీ వెంకటేశ్వర్లు, మదనపల్లె, వాల్మీకిపురం స్టేషన్ మేనేజర్లు శ్రీ రెడ్డిప్రసాద్, శ్రీ మనోహర్‌దాస్ పాల్గొన్నారు.

■

---

(మగపిల్లవానికి) 30 ఏళ్ళ వయసు దాటుతున్నా పిల్లనిస్తామని వచ్చేవారు గాని, అడిగేవారు కానీ లేరంటే పల్లె భవిష్యత్తేంటో ఆలోచిస్తేనే భయమేస్తోంది.

నాకు తెలిసినంతలో ఇంతగా వర్షాలు పడ్డా, పంటలు వేసుకునే సౌలభ్యం పెరిగినా, ఇక తమకు పెళ్ళికాదని పూర్తిగా నిర్ధారించుకుని, ఉన్న భూమిలో కొంత అమ్ముకుని, పట్టణాల్లో కార్పొరేట్ సంస్థల్లో (జియో, రిలయన్స్, పాలిమర్స్, హొటల్స్ లాంటివి) కొంత పెట్టుబడి (షేర్ సెక్యూరిటీ) పెట్టి నెల జీతాలకు వెళ్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పల్లెల్లో పైపై మెరుగులు తప్పించి, పూర్తిగా నిర్వీర్యమై పోతాయనటంలో అతిశయోక్తి వుండదు.

కావున దయచేసి ప్రభుత్వాలు, ప్రజాభివృద్ధికి పనిచేసే సంస్థలు వాస్తవాలు గ్రహించి, పల్లెలకు, పల్లె జీవనానికి, రైతుకు, వ్యవసాయానికి 'భరోసా' ఇచ్చేలాగా 'రైతు భరోసా కేంద్రాలు' పని చేసేవిధంగా ప్రయత్నాలు తీవ్రతరం చేయాలని నా ఆకాంక్ష !

■

ఏ విషయంలోనూ ఒక నిర్ణయం తీసుకోలేకపోవడాన్ని మించిన దౌర్భాగ్యం జీవితంలో మరొకటిలేదు

# 'శ్రీ' పద్ధతి రాగి సాగుతో అధిక దిగుబడులు

రాగి పంటను వర్షాధార సాగు చేస్తారు. తక్కువ లోతుగల నేలలు, ఇసుక నేలలు పంటను సాగు చేయడానికి అనుకూలంగా ఉంటుంది. విత్తనాన్ని వెదచల్లే మరియు నారు దగ్గరగా నాటే పదద్ధతిలో దిగుబడి చాలా తక్కువగా ఉంటుంది. కానీ "గుళి రాగి" లేదా "శ్రీ రాగి" పద్ధతి వలన రైతులు తమ దిగుబడులను పెంచుకోవచ్చు.

**ఈ పద్ధతిలో ప్రాథమిక సూత్రాలు:**

1. లేత నారును ఎంచుకొని పొలంలో నాటుకోవడం.
2. మొక్కల మధ్యన దూరం ఎక్కువగా ఉంచటం.
3. మొక్కలకు అధిక సూర్యరశ్మి తగిలేటట్టు పెంచడం.
4. సేంద్రియ ఎరువులని వాడటం.
5. కలుపు తీసే పరికరాలను ఉపయోగించి మొక్క వేర్లు బాగా పెరగటానికి అంతరకృషి చేయడం.
6. పిలకలు అధికంగా పెరగటానికి తేలికపాటి కర్రదుంగను లాగటం వంటి అంతరకృషి చేయటం.
7. పంట అవసరాన్ని బట్టి రక్షక తడులు ఇవ్వడం.
8. సహజ పద్దతిలో సస్యరక్షణ చేయటం.

**శ్రీ రాగి సాగులో ముఖ్యమైన పద్ధతులు**

విత్తనాల ఎంపిక: నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకొని బీజామృతంలో, ట్రైకోడెర్మా వీరిడితో విత్తన శుద్ధి చేసి నారుమడి తయారు చేసుకోవాలి. విత్తన శుద్ధి చేసిన విత్తనాలను ఇసుక, మట్టి, కంపోస్ట్ ఎరువులను 1:1:1 నిష్పత్తిలో కలపాలి.

నారుమడి తయారీ: 40 చదరపు అడుగుల నారుమడిని తయారు చేయాలి. దానికి 4 మీటర్లు పొడవు, 4 మీటర్లు వెడల్పు మరియు 1మీటరు ఎత్తు కొలతతో నారుమడిని తయారు చేసుకోవాలి. నారుమడిలో 500 కిలోల పశువుల ఎరువుని వేసుకోవాలి. ఒక ఎకరానికి 300 నుండి 500 గ్రాముల విత్తనం సరిపోతుంది. నారుమడిపై వరుసలు తయారు చేసి, వాటిలో విత్తనాలను విత్తాలి. విత్తిన తరువాత నారుమడి పైన వానపాముల ఎరువు గాని లేదా బాగా చివికిన పశువుల ఎరువును ఒక పలచని పొరగా చల్లాలి. మొక్కలు ఆరోగ్యవంతంగా పెరగటానికి ఒక వంతు జీవామృతాన్ని 10 వంతుల నీటిలో కలిపి నారుమడిపై పిచికారీ చేయాలి. మొక్కలను తీవ్రమైన ఎండ నుండి, పక్షుల నుండి రక్షించడానికి ఎండుగడ్డిని నారుమడిపై పరచాలి.

**నేల తయారీ, అచ్చు వేయడం :** ఒక ఎకరానికి 2 నుండి 4 టన్నుల పశువుల ఎరువును వేసి అవి భూమిలో కలిసేలా నేలను దున్ని చదును చేయాలి. మార్కరత్లో వరుసల మధ్యన 25×25 అంగుళాల దూరం ఉండేటట్లు అచ్చులు వేసుకోవడంవల్ల మంచి దిగుబడి పొందవచ్చు. ఈ అచ్చులు ఎరువు లేదా వర్మీ కంపోస్టుతో గుర్తుపెట్టాలి. నాట్లు వేయాల్సిన దూరానికి అనువుగా కొయ్యలతో మార్కర్లను తయారు చేసి, నేలపై రెండువైపులా లాగితే చదరంగా అచ్చు గుర్తులు వస్తాయి. వీటిపై కొంత ఎరువులు వేయడం వాళ్ళ గుర్తించడం సులువవుతుంది. సైకిల్ వీదరుతో కానీ ఎద్దులతో కానీ బోదెలు తీయాలి.

**నాట్లు వేయటం :** 12 – 20 రోజుల వయస్సు గల లేత నారును ఎంపిక చేసుకోవాలి. నారు తీయడానికి రెండు గంటల ముందు నారుమడిని నీటిలో తడపాలి. వేరు వ్యవస్థ పాడవకుండా మొక్కలను మట్టితో సహా పార లేదా వెడల్పయిన రేకుతో జాగ్రతగ్గా తీయాలి. నారు తీసిన 30 నిమిషాలలో నాలుగు గీతలు కలిసిన చోట చదరంగం మూలలో ప్రధాన పంట పొలంలో నారును నాటాలి. చిన్న బోదెలు తీసి వాటిలో మొక్కను ఉంచి మట్టితో కప్పితే నారు వేర్లు దెబ్బ తినకుండా ఉంటాయి.

**అంతర కృషి :** ఈ పద్దతి వేర్లు బాగా పెరగటానికి, నేలను గుల్ల పరచడానికి, కలుపును తీయడానికి పాటించాలి. నారు నాటిన ప్రతి 15, 25 మరియు 35 రోజులకి ఎడ్ల గొర్రు/గుంటక లేదా సైకిల్ వీదరుతో కలుపు తీసి జీవామృతం పిచికారీ చేసిన తరువాత తేలికపాటి కర్రదుంగను పంటపైన లాగాలి. దీనివల్ల కలుపు మొక్కలు పోవటమే కాకుండా,

వేరువ్యవస్థకు గాలి, నీరు, పోషకాలు అధికంగా అంది వేర్లు పటిష్టంగా తయారు అవుతాయి. మొక్కలు దూరం నాటడం వలన సైకిల్ వీడరుతో కలుపు సులభంగా తీయవచ్చు.

**పిలకలు ఎక్కువగా రావటానికి :** ఈ పద్ధతిని “గుళి రాగి” అంటారు, దీనివలన ప్రత్యేకంగా ఎక్కువ దిగుబడులు కలుగుతాయి. కలుపు తీసిన తరువాత లేత మొక్కలపై నుండి కలప దుంగను లాగాలి. కర్ర దుంగను తాడుకి కట్టి ఎద్దుల సహాయంతో లేదా రైతు తానే దీనిని లాగవచ్చును. ఇలా చేయడం వలన మొక్క వేర్లు మరియు కాండం కలిసే చోట మొక్కలు వంగిపోయి, విభజన కణజాలం ప్రేరణ పొంది అధిక పిలకలు వేస్తాయి. నారు నాటిన 15, 30, 45 రోజుల మధ్యలో మూడుసార్లు పొలంలో అన్ని దిక్కుల నుండి (తూర్పు నుండి పడమరకు తిరిగి వెనక్కు, ఉత్తరం నుండి దక్షిణానికి తిరిగి వెనకకు) లాగాలి.

**నీటి యాజమాన్యం :** వర్షాధార వ్యవసాయంలో వానల మధ్య బెట్ట రావటంవల్ల పంట నష్టం జరుగుతుంది. ప్రతి 3 నుండి 5 ఎకరాల పంటకు ఒక తడి ఇవ్వాలి. నేలలోఎక్కువ సేంద్రియ పదార్థం ఉన్నపుడు తేమ ఎక్కువసేపు ఉంటుంది.

**పంట కోత :** గింజలు గోధుమ రంగులోకి మారి, వెన్ను ఆకూ పండినట్లు ఉన్నపుడు పంటను కోయాలి. మొక్కకు ఎక్కువ పిలకలు ఉంటే 2, 3 దఫాలుగా పంటను కోయాలి. పంటకోత అయినాక పంటను 2 నుండి 3 రోజులు పొలంలోనే ఆరబెట్టాలి. వాటిని మట్టి బెడ్డలు, ఇసుక కలవకుండా టార్పాలిన్లను నేలపై పరిచి వెన్నులను కర్రతో కొట్టి లేదా ట్రాక్టర్ నడిపి గాని గింజలను వేరు చేయాలి. పంట అమ్మే సమయంలో తేమ శతం 12 నుంచి 14 వరకు ఉండేలా చూసుకోవాలి.

## పురుగులు, తెగుళ్ల నుంచి సస్య రక్షణ చర్యలు

| **తెగుళ్ల నివారణ పద్ధతులు** | **పురుగుల నివారణకు సాగు పద్ధతులు** |
|---|---|
| 1. బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి | 1. బంతిని లేదా బెండను ఎర పంటగా సాగు చేయాలి |
| 2. ట్రైకోడెర్మా విరిడి పొడిని పశువుల ఎరువుతో కలిపి నెలలో వేయాలి | 2. తెగుళ్లు సోకిన పంట అవశేషాలను తొలగించాలి |
| 3. తెగులు తట్టుకునే రకాలను ఎంచుకోవాలి | 3. నత్రజని ఎరువులను వాడకాన్ని తగ్గించాలి |
| 4. శొంఠిపాల కషాయాన్ని పంటపై పిచికారీ చేయాలి | 4. సాలీడు, అక్షింతల పురుగు వంటి మిత్రపురుగులు ఉండేలా చూడాలి |
| 5. కలుపు మొక్కలు లేకుండా చూడాలి | 5. వేసవి దుక్కులు చేయాలి |
| 6. తెగులు సోకిన మొక్కలు పీకి కాల్చేయాలి | 6. దీపపు ఎరలు పెట్టాలి |

**శ్రీ పద్ధతి ప్రయోజనాలు**

- అధిక ధాన్యం దిగుబడి పొందవచ్చు
- తక్కువ పంట వ్యవధి
- తక్కువ రసాయన వాడకం
- తక్కువ నీటి అవసరం (సంప్రదాయ సాగు పద్ధతి)
- జీవన ఎరువుల ద్వారా నేల ఆరోగ్యం మెరుగు పడుతుంది
- రాగులలో క్యాల్షియం, ఐరన్, ప్రోటీన్, ఫైబర్ మరియు మినరల్స్, అయోడిన్ పుష్కలంగా లభిస్తుంది
- పోషకాలను అందరించడమే కాకుండా, రోగ కారకాలను తొలగించి, దేహాన్ని శుద్ధిచేస్తాయి. ఆరోగ్యం అందిస్తాయి
- రాగులలో ఖనిజాలు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి
- వీటిని తీసుకోవడం వలన ప్రజలు వారి రోగ నిరోధక శక్తిని పెంచుకోగలుగుతారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల తీవ్రమైన కరోనా వైరస్‌ను తట్టుకోవడంలో ఉపయోగపడుతుంది.

■

**తననను తాను పట్టించుకోకపోతే మరెవరు పట్టించుకుంటారు? తనకేతాను పరిమితమైతే ఆ బతుకుకు అర్థమేమిటి?**

# నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం

– బ్రహ్మచారి



నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత కార్యక్రమం (వాష్ కార్యక్రమం) పై క్షేత్ర స్థాయి కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని అక్టోబర్ 9, 12, 17 వ తేదీలలో మూడు రోజులు పాటు హైదరాబాద్ మణికొండలోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారుగా 110 మంది ఎస్ ఎల్ ఎఫ్ నాయకులు, ఆర్ పి లు పాల్గొన్నారు.


ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి భవాని మాట్లాడుతూ నీరు, పారిశుధ్యం ప్రాముఖ్యతను, మరుగుదొడ్డి అవసరాలను, మనిషి మలం వలన ఎలాంటి రోగాలు వస్తాయో, బహిరంగ ప్రదేశాలలో మల విసర్జన చేయడం వలన నీరు ఎలా కలుషితం అవుతుందో, ఎగిరే కీటకాల ద్వారా, చేతి వేళ్ళ ద్వారా మలం మనం తినే ఆహారంలో ఎలా కలుస్తుందో వివరించి, వాటిని అధిగమించటానికి ఎటువంటి చర్యలు చేపట్టాలి, ఆ కార్యక్రమాలకు అవసరమైన నిధులను ఎలా సమకూర్చుకోవాలి అనే అంశాలను చర్చించారు.

శ్రీ బ్రహ్మచారి మాట్లాడుతూ వాష్ లోన్లు ఎన్నిరకాలు, వాటిని సంఘ సభ్యులకు ఏవిధంగా వివరించాలి ,వాటిని ఏవిధంగా ఇవ్వాలి, ఎక్కడినుండి అప్పులను సమకుర్చాలి అనే అంశాలను వివరించారు. త్రాగే నీటి నాణ్యతను ఏవిధంగా పరీక్షించాలి, వాటిని స్కోర్ కార్డుతో పోల్చి ఎస్ ఎం ఎస్ ను ఏవిధంగా పంపించాలి అనే అంశాలు వివరించడం జరిగింది.

ఈ కార్యక్రమం లో ఏపిమాస్ ఎం డి, సి ఇ ఓ శ్రీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సంఘాలు, సమాఖ్యలు పటిష్టంగా ఉంటేనే మహిళలు అన్నిరంగాలలో అభివృద్ధిని సాధించవచ్చని, ప్రతి మహిళ తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవడానికి ముఖ్యంగా ప్రతి ఇంటిలో నీరు, మరుగుదొడ్డి వసతులు వుండాలని అన్నారు.

ఇందుకోసం ప్రతి మహిళకు సంఘాలు లేదా సమాఖ్యలు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు రావాలని, సామాజిక అభివృద్ధిని పెంపొందించే కార్య క్రమాల గురించి సంఘ, సమాఖ్య సమావేశాల్లో చర్చించు కోవాలని అప్పుడే అందరికీ అన్ని విషయాలపై అవగాహన వస్తుందని తెలిపారు. ■

అణచివేతను ప్రతిఘటించడం మనిషి సహజ లక్షణం


నाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుద్ధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
నీళ్ళ ట్యాంకు మరియు రెండు గుంతల మరుగుదొడ్డి
దీర్ఘకాలం అందించెను మీకు సేవలు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

MAHILA SADHIKARATHA
Publication Date: 01-11-2020; Posting Date: 05-11-2020

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2018-20








అనంతపురం, హిందూపురం ఎంపిలకు ఏపిమాస్ ప్రచురణలను బహూకరిస్తున్న శ్రీ సి ఎస్ రెడ్డి
తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ శ్రీమతి జమున గారితో శ్రీ సి ఎస్ రెడ్డి సమావేశం



బొల్లవరంలో మొక్కజొన్న సేకరణ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎంఎల్ ఏ శ్రీ ఆర్థర్





ఎం-టమాట సి ఇ ఓ, మండల ఎఫ్ పి ఓలు, సి ఇ ఓలు హొసూరులో జరిపిన అవగాహన పర్యటనలో కొన్ని దృశ్యాలు




అన్నే ఫెర్రర్ నుంచి మార్తా ఫారెల్ అవార్డును అందుకుంటున్న 'రెడ్స్' భానుజ గారు



'మహిళా రైతు దినోత్సవం' సందర్భంగా కురుగుంట గ్రామంలో మహిళా రైతులతో జిల్లా కలెక్టర్ శ్రీ గంధం చంద్రుడు ప్రభృతులు







మహిళా రైతులకు సన్మాన దృశ్యాలు: నల్లమాడలో, గుడిబండలో, కామారెడ్డిలో ...







చౌవుదరి పల్లెలో మహిళా రైతు దినోత్సవ దృశ్యాలు .... పీలేరులో ఏపిమాస్ నూతన కార్యాలయం

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089